# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక


**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎన్ రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ వి.వి. ఆర్ ప్రసాదరావు

డా॥ యమ్ స్వర్ణముఖి



**సంపుటి 32 సంచిక 8**
**పేజీలు 40**
**ఏప్రిల్ 2013**

**5సం॥ల చందా రూ. 250**

**2సం॥ల చందా రూ. 120**

**సంవత్సర చందా రూ. 60**

**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో.................................. .......** **పేజీ**


| | |
|---|---|
| భద్రవాక్యం | 2 |
| యోగి వేమన | 3 |
| శ్రీబాబూజీ ఉవాచ | 4 |
| శ్రీమాతాజీ అభిభాషణ | 6 |
| సన్నిధిలో సంభాషణ | 8 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 10 |
| యోగవాశిష్ఠము | 11 |
| గురు కృపాహి కేవలమ్ | 13 |
| శ్రీమాతాజీతో యూరప్ యాత్ర | 15 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 17 |
| అధికులెవరు? | 20 |
| స్థిత ప్రజ్ఞుడు | 22 |
| జ్ఞానదీపం | 24 |
| గుడగూచి | 26 |
| సూరదాసుని శ్యామసుందరుడు | 28 |
| మాఘపూర్ణిమ | 30 |
| దానశీలత్వము | 31 |
| ఇద్దరు సాధువులు | 32 |
| వాదన | 33 |
| శ్రీసద్గురు పుణ్యారాధన రజతోత్సవ వేడుకలు | 34 |
| సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర | 35 |
| శ్రీరాధామాధవ రస సుధ | 37 |
| విష్ణు కథలు | 38 |

# భద్రవాక్యం

– పరాశర ప్రసాద్

ఓమిత్యేతదక్షర మిదగ్ం సర్వం తస్యోపవ్యాఖ్యానం ।
భూతం భవద్భవిష్యదితి సర్వమోఙ్కార ఏవ ।
యచ్చాన్యత్ త్రికాలతీతం తదప్యోఙ్కార ఏవ ॥

ఓం అను అక్షరమే సర్వస్వం. భూత, వర్తమాన, భవిష్యద్రూపంలో అవగాహనకు వచ్చేదంతా ఈ ఓంకారానికి వ్యాఖ్యానరూపం. అందువలన సమస్తమూ ఓంకారమే. అంతేకాక త్రికాలాతీతమైన ఏ వస్తువు గలదో అదీ ఓంకారమే కదా!

ఓంకారాన్ని పాదావలోకన రూపంగా తెలుసుకోవాలి. ఓంకారము భయరహిత బ్రహ్మాపదము. చిత్తాన్ని ఓంకారంలో సమాహితం చేసినవారు భయరహితులు. ఓంకారము అక్షరము అనగా నశించనిది. పరిణామము లేనిది.



ఓంకారము పరబ్రహ్మము. అంతా బ్రహ్మమే అయినప్పుడు జగత్తుగా వ్యక్తమయి చైతన్యముగా అవ్యక్తంగా ఉన్నది ఓంకారమే. జగత్తు జనించేది, పరిణామము చెందేది, గతించేది, కాని దానిని ప్రకాశింపజేసే చైతన్యము నశించనిది. అది త్రికాలాతీత మైనది. దానికి పుట్టుక, పరిణామము, మృత్యువు లేవు. అదే ఓంకారము.

అనాది, అనంతము. సృష్టికి పూర్వము ఉంది. జగత్తు ఉన్నా లేకపోయినా, నశించినా ఓంకారము ఉంది. ఉంటుంది. అదే సర్వసృష్టికి ఆధారమైనది.

ఓంకారము పరిణామము చెందకపోయినా, క్రియారహితమైనదైనా, సర్వజగత్తులో పరిణామాలకి, క్రియలకి ఆధారమైనది ఓంకారమే అని గ్రహించాలి. సృష్టి యావత్తు దాని నుండి ఆవిర్భవించిందే కాబట్టి బ్రహ్మము నుండి ఆవిర్భవించినది బ్రహ్మముకాక మరేమిటి? ఆ రహస్యాన్ని గ్రహించినవారే జ్ఞానులు.

వారు ఆ ఓంకారముతో తాదాత్మ్యము చెంది ఉంటారు. సద్గురుమూర్తిని ఆశ్రయించినవారు ఆ స్థితిని పొందుదురు గాక!!

*

# యోగి వేమన

గత సంచిక తరువాయి

- శ్రీ బులుసు వెంకటరమణయ్య

26. ఔర! యెంతవార లల్లరి మానవుల్
ప్రభువునైన గేలిపరతు రెన్నఁ
దాఁ దెగించువాఁడు దండియౌ భువిలోన
విశ్వదాభిరామ! వినురవేమ!



తాత్పర్యము -

అల్లరి జనులు లజ్జా భయమును విడచి ప్రభువునే హేళన చేయుచుందురు. మొండియై తెగించినవాడే గొప్ప వాడగుచున్నాడు.

27. కండకాపరమునఁ గానఁడు మరణంబు
మదముచేతఁ దత్వ మహిమఁగనఁడు
భోగకాంక్షచేతఁ బురహరుఁగానఁడు
విశ్వదాభిరామ! వినురవేమ!

తాత్పర్యము -

మూర్ఖుడు మరణమును తెలిసికొనకుండుటకు గర్వము, తత్త్వము గ్రహింపకుండుటకు మదము, భగవంతుని తెలిసికొనకుండుటకు సుఖముల యెడ కోరికయు కారణము.

28. కన్నులందు మదము కప్పి కానరుగాని
నిరుడు ముందటేఁడు నిన్న మొన్న
దగ్ధులైనవారు తమకంటె తక్కువ?
విశ్వదాభిరామ! వినురవేమ!

తాత్పర్యము -

మూర్ఖులజ్ఞానులై కన్నుల గాన లేకున్నారు. చావు లేదనుకొనుచున్నారు. తమకంటె అన్నింటను గొప్పవారే మరణించుచున్నారు కదా!



# శ్రీబాబూజీ ఉవాచ

– పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులకు బోధచేస్తూ "మనస్సును ప్రకాశింపచేసేది చైతన్యమే కదా? మరి అటువంటి మనస్సులో మలినభావాలు కలగడానికి కారణాలు ఏమిటి? అన్న మీ సందేహం తెలుసుకోవలసిందే. మనస్సుకు స్వయం ప్రకాశం లేదు. అది యదార్థమే. కాని! మనస్సు యొక్క స్వాభావిక లక్షణం సంకల్పించటం అందువలనేమనస్సులో ఉత్పన్నమయిన భావాలు "మంచివికావచ్చు, మలినమయినవి కావచ్చు. శుద్ధమనస్సు పవిత్రమయిన భావాలను వ్యక్తంచేస్తుంది. అశుద్ధ మనస్సులో మలినభావాలు ఉత్పన్నమవుతాయి.

ఇక్కడ మీకొక దృష్టాంతం చెపుతాను. మీ గృహంలో లైట్లు, ఫ్యాన్లు, ఎ.సి., టి.వి. మొదలైన పరికరాలన్నీ, సవ్యంగా పనిచేయడానికి కావలసిన కరెంటు వుంది. కరెంటు సరఫరా లేకపోతే ఏ పరికరము సక్రమంగా పనిచేయదు. అది యదార్థమే. కాని ఈ పరికరాలన్నీ పరిణామం చెందేవే కదా. శాశ్వతమైనవి కాదు కదా! అలాగే మానవ దేహం లేక ఉపాధి పరిణామం చెందే పరికరం. అది శాశ్వతమైనది కాదు.



పరిణామము చెందే ఏ యంత్రమయినా, పరికరం అయినా, మానవ దేహమయినా పతనము చెందక తప్పదు. కరెంటు, బల్బుకి వెలిగేశక్తిని ఇవ్వగలుగుతుంది గాని దాని పరిణామాన్ని మార్చదుకదా! అది సృష్టి రహస్యం" అన్నారు.

శ్రీ బాబూజీ మహరాజ్ ఇంకా మాట్లాడుతూ "మానవుడై జన్మించిన తరువాత అతను పయనించే సంసార సాగరంలో అలల ప్రభావానికి గురికాక తప్పదుకదా! అయితే అటువంటి మానవుడు సమర్థులైన సద్గురు మూర్తిని ఆశ్రయించి, ఆయన ప్రసాదించిన లక్ష్యార్థాన్ని సాధించి తన జీవిత గమ్యాన్ని చేరుకోగలుగుతాడు. అయితే గురుదేవులు ప్రసాదించిన మంత్రానికి అంతశక్తి వుంటుందా అని మీకు సందేహం కలుగవచ్చు.

ఇక్కడ మీకొక ఉదంతాన్ని చెపుతాను. సత్యవ్రతుడనే పండిత పుత్రుడు తండ్రి చేసిన తప్పుకి ఫలితంగా శాపగ్రస్తుడై విద్యాహీనుడై 11 ఏండ్లు వయస్సు వచ్చినా బుద్ధిహీనుడై ఇల్లు వదలి ఒక అరణ్యంలో చిన్న కుటీరం నిర్మించుకొని అక్కడ లభించే కందమూలాదులను తిని జీవిస్తున్నాడు. చదువులేదు సరికదా! లోకజ్ఞానము కూడా లేదు. ఏ పనికీ పనికిరాడు. అది అతని దుస్థితి. అందువలన తన కుటీరంలోనే కూర్చొని

కండ్లు మూసుకొని ధ్యానం చేసుకొనేవాడు.

ఒకనాడు కొందరు బోయవాళ్ళు ఒక అడవిపందిని వేటాడి దానిని బాణంతో గాయపరిచారు. అది వారినుంచి తప్పించుకొని పరిగెడుతూ, తనకు తగిలిన గాయాన్ని వోర్చుకోలేక 'ఐం', 'ఐం', 'ఐం' అని మూలుగుతూ సత్యవ్రతుని కుటీరం వైపుకు వెళ్లింది. ఇంతలో ఆ బోయవాళ్ళు వచ్చి సత్యవ్రతునికి నమస్కరించి 'స్వామీ మేము బోయవాళ్ళం ఏ విద్యార్హతలు లేని వాళ్ళం మాకు ఈ అరణ్యంలో లభించే జంతువులే మాకు ఆహారం, ఇప్పుడే ఒక అడవి పందిని వేటాడాం. అది ఇటు మీ ఆశ్రమం వైపునకు వచ్చినది. దాని సమాచారం తెలియజేసి అనుగ్రహించండి' అని ప్రార్థించారు.

సత్యవ్రతుడు అడవిపంది నోటినుండి వెలువడిన ఐంఐం అనే బీజాక్షరాలను స్మరిస్తూ ధ్యానంలో వున్నాడు. సత్యవ్రతుడు శాపగ్రస్తుడే గాని యాగఫలితం వలన జన్మించిన పుత్రుడుగాబట్టి జన్మ సంస్కారం గలవాడు. బీజాక్షరాలను స్మరించినంత మాత్రంచేత శాపవిముక్తుడై సరస్వతి కటాక్షాన్ని పొంది విజ్ఞానవంతుడైనాడు. బోయవాళ్ళమాటలువిని కళ్లు తెరచిచూచాడు. పరిస్థితిని గమనించాడు. అసత్యం ఆడకూడదు. సత్యము పలికితే జీవహింసకి పాల్పడినట్లువుతుంది. వివేకవంతుడు అయ్యాడు కదా! బోయవాళ్ళకు తగిన సమాధానం చెప్పాడు.
యా పశ్యతి న సాభ్రూతే, యా భ్రూతే సా న పశ్యతి, దాని అర్థం ఏమిటంటే చూచే కన్ను మాట్లాడదు మాట్లాడే నాలుక చూడలేదు. అని సమాధానం చెప్పాడు.

శ్రీ బాబూజీ మాట్లాడుతూ చూశారా! "అమ్మవారి బీజాక్షరములు స్మరించినంత మాత్రం చేత విద్యాహీనుడైన సత్యవ్రతుడు ఎంతటి జ్ఞానవంతుడయ్యాడో మరి త్రిమూర్తి స్వరూపుడైన సద్గురుమూర్తి ప్రసాదించిన లక్ష్యార్థాన్ని విశ్వాసంతో ధ్యానిస్తే, మీకు లోటు వుంటుందా? అది ఎటువంటి భవసాగరాన్నయినా సునాయాసంగా దాటించ గలుగుతుంది. ఆ సాగరంలో ఎన్ని అలలువుంటే మాత్రం మీరు ఆశ్రయించిన గురులక్ష్యార్థమనే నావ, మిమ్మల్ని గమ్యస్థానానికి చేర్చలేదా?

*

గత సంచిక తరువాయి

# శ్రీ మాతాజీ అభిభాషణ

-జపమాలా ప్రసాద

తల్లి మన కడుపెరిగి పెట్టినట్టు గురుదేవులు కూడా మన శ్రేయస్సు కోసమే పెడతారు. తల్లి సున్నివుండలు చేసి డబ్బాలో పెట్టి, తన బిడ్డతో "ఒరేయ్ నాన్నా! ఇవన్నీ నీ కోసమే చేసి పెట్టాను, కానీ ఇప్పుడు తినకూడదు. నీకు తరువాత పెడతాను" అంటుంది. పిల్లవాడు తనకిప్పుడే కావాలని మారాం చేస్తాడు. తల్లికి విసుగు వచ్చి ఒక సున్నుండ ఇస్తుంది. వాడింకా కావాలని ఏడుస్తాడు. చివరికి విసిగిపోయి ఆ తల్లి "తీసుకో" అని డబ్బా ఇచ్చేస్తుంది. దీనిని "ప్రేయస్సు" అంటారు. మనం ఆనందం వుందని అనుకుంటున్నాం, కానీ అది మనకి నిజంగా మంచి చేయదు. ఇది "ప్రేయస్సు". తనబిడ్డ శ్రేయస్సే కోరే తల్లి అయితే, వాడుఎంత ఏడ్చి గీపెట్టినా ఇవ్వదు. ఇంకా మాట్లాడితే, ఆ సున్నుండల పైన మిరియాల పొడి రాసి ఇస్తుంది! (కడుపుని పాడు చేసే సున్నికి మిరియాల పొడి విరుగుడంటారు).



గురుదేవులు కూడా అంతే. మన శ్రేయస్సుకి మంచిది కాదు అంటే అది మనకి ససేమిరా పెట్టరు. దివ్యమైన మంత్రాన్నిస్తూ, దాని అనుష్ఠానంలో మనకి అడ్డువచ్చే వాటి గురించి చెప్పి, వేటి వేటిని నిరోధించాలో బోధ రూపంలో చెప్తారు. దానిని ఆచరిస్తే, ఆనందం మన సొత్తవుతుంది. గురుదేవుడెప్పుడూ శ్రేయస్సునే చూస్తారు కానీ ప్రేయస్సుని కాదు. మంత్రాన్ని మనకిస్తూ కొన్ని పథ్యాలు చెప్తారు. 1. లోకాభిరామాయణం మాట్లాడకూడదు. 2.ఇతరుల గురించి చెడుమాట్లాడకూడదు. 3.మన సమయాన్ని భగవంతుడికే వినియోగించాలి. అదే సత్యకాలంలో జమవుతుంది.4.మానవునికీ మానవునికీ మధ్య భేదబుద్ధి నశంచాలి. 5. అందరిలోనూ మంచినే జుర్రుకోవాలి. 6.ఎప్పటికప్పుడు మనసుని సానబెట్టుకుంటూ సాధన చతుష్టయ సంపత్తిని సంపాదించుకోవాలి.

ఇవీ మనం చేయవలసిన పథ్యాలు. నిత్యానిత్య వస్తు వివేకం అనేది మన జీవితంలో ఎలా వుంటుందో మీకొక చిన్న ఉదాహరణ చెపుతాను. ఒకమంచి చీర ఉంది. అది అనిత్యమైనది. అది కేవలం మన దేహానికి ఆచ్ఛాదన మాత్రమే. అంతవరకే దానిని చూడాలి గానీ, దానిమీద మమత్వం పెంచుకుంటే మనకి దు:ఖం తప్పదు. అలాగే పిల్లలపైన కూడా మమత్వం పెంచుకోకూడదు. "అది నాది, ఇది నాది" అని అనుకున్న దేహం ఇక్కడే వుండిపోతోంది.

"మా నాన్నగారు పోయారు" అంటాడు. "మరి, నీ ఎదురుగా వున్నదెవరు?" అని అడిగితే, "అది మా నాన్న శవం" అంటాడు. "ఇంతకీ పోయినవాడా మీ నాన్న

లేక ఉన్నవాడా? నీ ఎదురుగా వున్నవాడు ఎవరు?" అని అడిగితే, "ఇప్పటిదాకా ఈయనే మా నాన్న అనుకున్నాను" అంటాడు. ఈ సత్యాన్ని గుర్తించడానికి ఎన్ని సంవత్సరాలు కావాలి?

మమకారమనేది ఎలా వుంటుందో మనకి జనక, యాజ్ఞవల్క్య మహర్షుల కథని బట్టి తెలుస్తుంది. జనకుడంటే యాజ్ఞవల్క్యుడికి చాలా యిష్టం. అది ఆ మహర్షి శిష్యులలో ఈర్ష్య జనింపచేసింది. వారిలోని కలుషాన్ని తొలగించడానికి ముని ఒక చక్కని సన్నివేశాన్ని సృష్టించారు.

ఒకనాడు జనకమహారాజు, యాజ్ఞవల్క్యుడు చక్కటి తత్త్వ విచారణ సభ చేస్తూ వుండగా, రాజ్యం తగలబడిపోతున్నట్టుగా కనిపించింది. రాజ్యానికంతటికీ మహారాజయిన జనకుడు తన స్థానం నించి కదలలేదు. తత్త్వవిచారణ నుండి బయటకి రాలేదు. కానీ యాజ్ఞవల్క్యుని శిష్యులు మాత్రం "అయ్యో! మా గోచీగుడ్డలు కాలిపోతాయి" అని మునివాటిక వేపు పరుగులు పెట్టారు! మమకారం అంటే ఇలా వుంటుంది!

"గృహస్థాశ్రమ ధర్మం బంధించదు. కానీ మన ఆశయే మనని బంధిస్తుంది. ఉన్న దానితో తృప్తిపడితే, ఉన్నది ఉన్నట్టుగా గుర్తించగలుగుతాం. దేహభావన పోతేనే మనస్సు నిశ్చలంగా భగవంతుడి మీద నిలబడుతుంది. ఇప్పుడు అర్థమయిందా, జనకుడంటే నా కెందుకంత ఇష్టమో? దేశానికి చక్రవర్తి అయికూడా, తన రాజ్యం తగలబడిపోతున్నా, తన లక్ష్యసాధన నుండి చలించలేదు. దేశ రక్షణకై మంత్రులని నియమించే వున్నాడు. ఆ పని వారు చేసి తీరుతారు అని నిశ్చితంగా వున్నాడు, మరి మీరో! అన్నీ వదిలి పెట్టిన సర్వసంగపరిత్యాగులమంటూ, గోచీగుడ్డలని రక్షించుకోడానికి పరుగులు పెట్టారు!" అని యాజ్ఞవల్క్యుడు శిష్యులకి బోధ చేశారు. "సమాధానం" అంటే అలా వుంటుంది. అది జనకుని చూస్తే తేటతెల్లమవుతుంది.

మనం కూడా యీ మానవజన్మ వచ్చినందుకు సార్థకం చేసుకోవాలంటే అటువంటి శ్రద్ధా, తత్పరత కలిగి వుండాలి. "నేను దేహం కాదు" అని అనుకున్నంత మాత్రాన కాకుండా పోము. దానికి నిరంతర విచారణ కావాలి. నేను దేహం కాకపోతే మరేమిటి అయివున్నాను? అని శోధించాలి. అలా విచారణ చేస్తూ వెళితే, ఇది కాదు - ఇది కాదు. ('నా ఇతి, నా ఇతి') అని ఒక్కొక్కటీ తీసిపారేస్తే మిగిలేది తానే. ఉల్లిపాయలోని ఒక్కొక్క పొర తీస్తూ వుంటే చివరకి ఏమి మిగులుతుంది? ఒలిచినవాడే మిగులుతాడు! యజ్ఞ యాగాది క్రతువులు చేయవలసిన పనిలేదు. కేవలం నామస్మరణ వలన కలికాలంలో మనుషులు తరిస్తారని నారదమహర్షి 'కలి సంతరణోపనిషత్తు' లో చెప్పారు. 'నామస్మరణ' అంటే భగవన్నామ స్మరణ సుమా! గురుమూర్తి ప్రసాదించిన నామం మనని ఈ జనన మరణ మృత్యురూప సంసార సాగరం నుండి తరింపచేస్తుంది. అట్టి గురుపాదుకలు అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను, అఖండ సాధనా సంపత్తిని ప్రసాదించి సర్వదా మనను కాపాడుగాక!

# సన్నిధిలో సంభాషణ

- పరాశర ప్రసాద్

26.6.85

శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ "నేనెవరు? అని ప్రశ్నించుకుంటే అంతా తెలుస్తుంది" అన్నారు. నేను దేహంకాదు, ఇంద్రియాలు కాదు, బాహ్యేంద్రియాన్ని కాదు. అంతరింద్రియాన్ని అంతకన్నా కాదు. వీటన్నిటికి అతీతమై అన్నింటిని ప్రకాశింపచేసేది నేను అని తెలుసుకోవాలి. అలా తెలుసుకోవాలంటే సత్యగురువుని ఆశ్రయించాలి. ఆయన అనుగ్రహాన్ని పొందాలి. గురుదేవుడు చేసే ఉపదేశమే లక్ష్యార్థము.



ఆయన అష్టాక్షరీ మంత్రాన్ని ప్రసాదించారు. శిష్యుడు దానిని ఆచరించాలి కదా! సత్యగురువు చేసే ఉపదేశానికి ముసుగు అక్కరలేదు. రహస్యం అంతకన్నా లేదు. ఆ నారాయణమంత్రాన్ని మూడు పూటలా ధ్యానించిన వాడి మనస్సు నిలిచిపోతుంది" అన్నారు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ 'మానవుడు దేహదృష్టి, ఇంద్రియ భావన కలిగి ఉండటానికి, ప్రాపంచిక విషయాలపైననే దృష్టి నిలపటానికి మనస్సే కారణము. ఆ మనస్సు నిలిచిపోతే మానవుడే మాధవుడౌతాడు. మానవుడికి మాధవుడికి మధ్య మనస్సు అనే ఆవరణే అడ్డుగా ఉంటుంది. అదే ఆవిద్యారణ్యం. దాంట్లో ఏనుగులు, పులులు, సింహాలు, ఏదుపందులు మొదలైన క్రూరమృగాలు ఉంటాయి. అవి మనస్సుని బాధిస్తాయి.

కాని గురుదేవుడు ఇచ్చిన లక్ష్యార్థాన్ని స్మరించిన వాడికి క్రమేపి నామస్మరణ ధ్యానంగా మారి మనస్సు నిలిచిపోతుంది. అప్పడు ధ్యానాగ్ని పుట్టి ఆ అవిద్యారణ్యాన్ని దగ్ధం చేస్తుంది. ఆరణ్యంలో అగ్ని పుట్టగానే అక్కడ ఉండే క్రూరమృగాలన్నీ ఉండమన్నా ఉండకుండా పారిపోతాయి. వాటిని ఎవరూ అపలేరు. ఆవిధంగా మనస్సు శుద్ధి చెందుతుంది.

సత్యగురువు శంఖు, చక్రాలను మనస్సుపై ముద్రిస్తాడు. తేనెటీగ పుష్పాల నుండి మధుర పదార్థాన్ని స్వీకరించి దానిని నిస్స్వార్థంగా అందరికీ అందజేస్తుంది. ఇక్కడ ఇంకొక విశేషం ఉంది. తేనెటీగె తనకి ఆహారం లేకపోతే, ప్రాణాన్నయినా త్యాగం చేస్తుంది కాని ఎట్టి పరిస్థితులలోనైనాసరే పుష్పాలను తప్ప మరి ఏ ఇతర పదార్థాలని

ఆశ్రయించదు. గురుతత్వాన్ని అర్థం చేసుకొన్నవాడికి ద్వైతం హరిస్తుంది. గురుదేవుడు తనను ఆశ్రయించిన భక్తులయందు ఎంతో ఆప్యాయతతో, వాత్సల్యంతో వారిని ఈ జనన మరణ విషవలయంనుండి విముక్తులను చేయటానికి పూనుకుంటారు.

శ్రీరామానుజులవారు జాతి, మత, కుల, భేదం లేకుండా అందరికీ అష్టాక్షరీ మంత్రాన్ని బహిరంగంగా ఏ విధమైన రహస్యం లేకుండా బోధించారు. చాలామంది ఆయనని తప్పు పట్టారు. కాని రామానుజుల వారు మాత్రం అలా భావించలేదు. 'నేను చేసినది పాపమే అయితే నేనొక్కడినే నరక బాధని అనుభవిస్తాను. కాని నేను బోధించిన నారాయణ మంత్రాన్ని స్మరించిన వారంతా భవబంధ విముక్తులై తరిస్తారు కదా! అనుకున్నాడు. మహాత్ముల దృష్టి అలా ఉంటుంది.

మహాత్ములవలె నటించేవారు కొందరుంటారు వారిది ఈగ దృష్టి. ఈగ ఎప్పడూ మలిన పదార్థాలనే ఆశ్రయిస్తుంది. ఆ మలినాన్ని కూడబెట్టి మంచిపదార్థాలని కూడా పాడుజేస్తుంది. కాబట్టి సత్పురుషులనే ఆశ్రయించాలి. నారాయణ మంత్ర రసంలో పూర్తిగా మునిగినవాడే తానెవరో తాను తెలుసుకుంటాడు" అన్నారు.

*

## దేవుడు ఉన్నాడా?

*ఒక సాధువును నాస్తిక సంఘం వారు "దేవుడు ఉన్నాడా? ఉంటే వెంటనే చూపు" అన్నారు.*

*"చాలా అలసిపోయాను. కాసిని పాలు తెప్పించండి. పాలు తాగాక చూపుతాను" అన్నాడు సాధువు.*

*తెచ్చిన పాలను పుల్లతో కలుపుతూ కూర్చున్నాడు. త్రాగకుండా.*

*"పాలు త్రాగరేమి? ఎందుకలా కలుపుతూ కూర్చున్నారు?" అని అడిగారు నాస్తికులు.*

*"వెన్న కనబడుతుందేమో అని" అన్నాడు సాధువు.*

*"వెన్న అలా కనబడుతుందా? పాలు కాచాలి, తోడెయ్యాలి, పెరుగు చిలకాలి అప్పుడు వెన్న కనబడుతుంది" అన్నారు నాస్తికసంఘం.*

*"అయితే దేవుడేనా అంత తేలికగా కనిపించేది? సాధన అక్కర్లేదా?" అన్నాడు సాధువు.*

*నాస్తిక సంఘంవారు తలవంచుకున్నారు.*

# శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు

**ఏప్రిల్ 2013**

05 శుక్ర శ్రీ గురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

08 సోమ మాస శివ రాత్రి.

11 గురు శ్రీ విజయ నామ సంవత్సర ఉగాది 11 గం.లకు పంచాంగ శ్రవణం, శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన.

12 శుక్రవారం నుంచి 18 గురువారం వరకు మౌన ధ్యాన సప్తాహ శిబిరం.

19 శుక్ర శ్రీ రామనవమి, ఉదయం గం.5.30లకు శ్రీ సద్గురు పాదపూజ, 11 గం.లకు సామూహిక శ్రీ సీతారామ కళ్యాణములు, భక్త సమారాధన.

25 గురువారం పూర్ణిమ - శ్రీ సద్గురు పాద పూజ.

మే 2013

4 శని శ్రీగురుదశమి. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

8 బుధ మాసశివరాత్రి

15 బుధ శ్రీశంకరాచార్య జయంతి, శ్రీసద్గురు అష్టాదశ వార్షిక ప్రతిష్ఠా మహోత్సవము శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్త సమారాధన

25 శని వైశాఖ గురు పూర్ణిమ శ్రీసద్గురుపాదపూజ, సత్సంగ సమావేశము, భక్తసమారాధన

29 బుధ శ్రీమహాకాళికా పరమేశ్వరీసమేత శ్రీరామలింగేశ్వరస్వామి వార్షిక ప్రతిష్ఠా కళ్యాణ మహోత్సవము.

## వేసవి శిక్షణా తరగతులు

*శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమంలో బాలబాలికలకు ఉచిత వేసవి శిక్షణా తరగతులు మే1 బుధవారం నుండి ప్రారంభమవుతాయి. ఆసక్తిగలవారందరూ పాల్గొని లబ్ధిని పొందగలరు. ఈ తరగతులలో ఆశ్రమ ప్రార్థన, భగవద్గీత, ఉపనిషత్తులు మొదలైన అంశములు నేర్పబడును. తల్లిదండ్రులు గమనించగలరు!*

# యోగవాశిష్ఠము

-సుషుమ్న ప్రసాద

(గత సంచిక తరువాయి)

కాలము - ఈ విశ్వములో జీవితమనే దారాన్ని ముక్కలుచేసే మూషికములాంటిది కాలం. ఈ జగత్తులో కాలసర్ప కాటునుండి తప్పించుకోగలిగినదేదీ లేదు. అన్ని వస్తువులు కాలం గుప్పెటలో ఉన్నాయి. సర్వ వ్యాపకమైన కాలం బారినుండి యెట్టి గొప్ప వ్యక్తి కూడా తప్పించుకోలేడు. రోజులు, నెలలు, సంవత్సరాలు, శతాబ్దాలు, యుగాలుగా పరిగణింపబడే కాలానికి ఇతమిత్థమైన రూపము, లక్షణాలు లేవు.



కాలమనేది ప్రళయకాలములో, భయానకమైన అగ్ని రూపం దాల్చి, అన్నిటినీ భస్మం చేస్తుంది. కాల గమనాన్ని ఎవరూ ఆపలేరు. ప్రళయం తరువాత ఉనికిని కోల్పోయి, నిత్యత్వములో లయమవుతుంది. కొంత విశ్రాంతి తరువాత కాలము తిరిగి సృష్టికర్త, స్థితికర్త, లయకర్త అన్నిటినీ గుర్తుంచుకునేలా రూపొందుతుంది. అలా కాలము వృద్ధిపొంది స్థితి చెంది తిరిగి లీలగా వినాశ మొందిస్తుంది.

మనసనేది కాంతా ప్రలోభంతో వృథా అవుతున్నది. తరువాత శరీరము వృద్ధాప్యపు బరువుతో కుంగిపోతుంది.మానవుడు మరణ సమయంలో తాను చేసిన తప్పిదాలకు దుఃఖిస్తాడు. ఈ రోజు అందమైన, విలువైన దుకూలాతో, పుష్పగుచ్ఛాలతో అలంకరింపబడిన ఈ దేహము మరునాడు బుగ్గిపాలవుతుంది.

జ్ఞానేంద్రియ ప్రలోభమైన, భయానక విషమందు ఎంత శక్తివంతమైన విషమైనా బలాదూర్. మామూలు విషము ఒక శరీరాన్నే నశింపజేస్తుంది. కాని ఇంత ప్రలోభమైన విషము అనేక జన్మల్లో అనేక శరీరాలను వినాశము చేస్తుంది. నీటిమీద బుడగలాగా, ఈ జీవితమనేది తృణప్రాయము. భౌతిక సుఖాలు మెరుపుతీగలాగ క్షణికమైనవి. యౌవన దశలోని సుఖాలన్నీ క్షణికము.

ఇలా తన విషాదానికి మూలమైన కారణాలన్నిటిని వివరించి శ్రీరామచంద్రుడు విశ్వామిత్రునితో "ఓ మహర్షీ! నా యీ విషాదాన్ని సమూలంగా తొలగించి, సత్యజ్యోతిని సాక్షాత్కార మొందించ"మని విన్నవించుకున్నాడు. "బాధలకు, బలహీనతలకు, సందేహాలకు, భ్రాంతులకు అతీతమైన స్థితిని ప్రసాదించండి. పరమానందాన్ని, నిత్యానందాన్ని నిత్యశాంతిని పొందే మార్గాన్ని సూచించండి" అని కోరాడు.

## శ్రీ శకుదేవుని చరిత్ర

అప్పుడు విశ్వామిత్ర మహర్షి మహదానందముతో శ్రీరామచంద్రునుద్దేశించి యిలా ప్రబోధించారు. "ఓ రామా! నీకు మంచి వివేక శక్తి, వైరాగ్యము, సహేతుక విమర్శ కలదు. మేధాసంపత్తి, చక్కని అవగాహన సహజ సంపద. నీవు నేర్చుకోవలసినది ఏదీ లేదు. వ్యాసమహర్షి పుత్రుడైన శుకదేవునితో సమానమైన ఆధ్యాత్మిక జ్ఞానము నీకు ఉన్నది. శ్రీశుకునకు అతీంద్రియ శక్తి వలన ఆత్మజ్ఞానమున్నా, అతని ఆధ్యాత్మికానుభవాన్ని సుస్థిరం చేసుకోవటానికి కావలసిన ఉపదేశావసరమున్నది.

వెంటనే శ్రీరామచంద్రుడు విశ్వామిత్ర మహర్షిని అభ్యర్థించాడు "ఓ మహనీయా! తన జ్ఞానాన్ని గురించి నిశ్చిత బుద్ధితో, ఆధ్యాత్మికానుభవాన్ని ఎలా పొందాడో నాకు తెలియజేయండి" అన్నాడు.

అప్పుడు విశ్వామిత్రుడు "రామచంద్రా! నీవు యథాతథంగా ఆనాటి శుకదేవుని మానసిక స్థితిలోనే ఉన్నావు. ఆయనకు ఉదాత్తమైన ఆధ్యాత్మిక జ్ఞానమున్నది. నీలాగే యీ జగత్తు యొక్క మాయా స్వభావమును చక్కగా విచారించి. ఈ ప్రాపంచిక విషయాలకు పూర్తిగా విముఖడయ్యాడు. ఆత్మజ్ఞానము పుష్కలముగా ఉన్నా, మానసిక స్థిమితము లేదు. జ్ఞానము యొక్క నిరూఢత్వము గురించి నిశ్చితాభిప్రాయము లేదు. వెంటనే తండ్రిగారి దగ్గరకు వెళ్ళి తన సందేహ నివృత్తి చేయమని కోరాడు. "ఇంత బాధ, అలజడికి గురి చేస్తున్న మాయకు మూలమేమిటి? అది ఎలా రహితమవుతుంది? ఈ మాయ ఎంతవరకు విస్తరించి ఉంది? ఇది ఎక్కడ అంతమవుతుంది? ఈ జగత్తు ఎప్పుడు ఉద్భవించింది?" అని ప్రశ్నించాడు.

వ్యాసమహర్షి శుకుని ప్రశ్నలన్నిటికి చక్కగా సమాధానం వివరించాడు. కాని శుకమహర్షి సమాధాన పడలేదు. ఎందుకంటే వారికి ఇవన్నీ పూర్తిగా తెలుసు. అప్పుడు వ్యాసమహర్షి తన పుత్రుని సమాధానపరచటానికి జనకమహారాజు దగ్గరకు వెళ్ళమన్నాడు. వెంటనే శుకమహర్షి విదేహనగరానికి బయలుదేరి వెళ్ళాడు.

– సశేషం



దేవగణార్చిత సేవిత లింగం
భావైర్భక్తి భిరేవచ లింగం
దినకర కోటి ప్రభాసిత లింగం
తత్ప్రణమామి సదాశివలింగం

# గురు కృపా హి కేవలమ్

- సుశీల ప్రసాద

1. 1961సం.లో జనవరి 31, మంగళవారం నాడు గుంటూరులో శ్రీగురుదేవులు మాజేటి పున్నయ్యగారింటికి వేంచేశారు. భక్తులందరిని సాయంత్రం 4గం. సమావేశానికి రమ్మనమని చెప్పారు. శ్రీబాబు "మాఘపూర్ణిమ. సముద్ర స్నానం చేసే రోజు" అని తన్ని చూపించుకుంటూ "వీడు షోడశకళలతో నిండి వచ్చేశాడు అన్నప్రకారం" అంటూ ఆత్మ తత్త్వం గురించి బోధ చేశారు.

స్వామి ఆరోజుల్లో భక్తులందరితో ఛలోక్తులు ఆడుతూ అందరి మధ్య భోజనం చేసేవారు. ఆ రోజు భోజనం చేస్తుంటే ఒక భక్తుడు 'మందులు వేసుకుంటున్నారా బాబూ?' అని అడిగాడు. "లేదు లేదు అది అసలు రోజూ వేసుకునేది కాదయ్యా. పది రోజులుకొక మాటు. ఆపైన ఈ ప్రయాణాలు. వేడి చేస్తుందని మాన్చేశాను. (మానేశాను అనటానికి శ్రీబాబు ఆ విధంగా పలికేవారు). అసలు ఆ రెండు పొట్లాలు ఎక్కడో పోయాయి. డాక్టరుగారికి "ఎక్స్యూజ్ మి. పొట్లాలు పోయాయి. మళ్ళీ పంపించవలసినది అని లెటర్స్ రాయాలి" అన్నారు.

ఫిబ్రవరి 1 బుధవారం ఉదయం స్నానం చేసి వచ్చి సభలో కూర్చున్నారు. సుశీల చేత అష్టపదులు పాడించి అర్థం చెప్పమన్నారు. "నాకేమో చదువురాదు. వీళ్ళెవరూ పండితులు కారు. సిగ్గుపడకు. చెప్పు" అన్నారు. అని "నేనూ ఇలాగే సిగ్గు పడేవాడిని మొదట్లో. నా సిగ్గులో నేను ఉండేవాణ్ణి, జగన్మాత మొదలుపెట్టి మాట్లాడేసేది. అసలు రాధ ఎందుకంత తపన పడింది? ఒకవేళ ధనం కోసమా?" అని అంటూ మెల్లిగా బోధ ప్రారంభించి కృష్ణుణ్ణి గురించి, శివుణ్ణి గురించి ఎంతో బ్రహ్మాండంగా బోధ చేశారు.

ఆరోజు సాయంత్రం 4గం.లకి ప్రయాణం. ఇంకా కారు రాలేదు. ఉయ్యాల బల్లమీద కూర్చుని పాలకడలి శేషశయనుడిలా పవళించి ఫొటోలు తీయించుకున్నారు. తరువాత మొగవాళ్ళందరితోటి ఫొటోలు తీయించుకున్నారు. "మరి ఆడవాళ్ళందరితో ఒక ఫొటో బాబూ!" అంటే, "నేను తీస్తాను వాళ్ళందరికి" అని అందరినీ నిలబెట్టారు. "అందరూ ఫకాలున నవ్వుతూ ఉండండి" అని సలహా ఇచ్చి, గంటన్నరకి "ఫొటో తీశాను" అన్నారు. అప్పుడు గోపాల్ మెల్లిగా "అందులో ఫిల్మ్ లేదండీ" అన్నాడు. "అయ్యయ్యో! పాపం! అన్యాయం కదా! కెమేరాలో సున్న కనబడుతోందేమిటా! అని కూడా అనుకున్నాను" అన్నారు. ఇది మొదటి పూర్ణిమ. పూర్ణిమలకి శ్రీకారం చుట్టిన మొదటి పూర్ణిమ.

2. ఫాల్గుణ పూర్ణిమకి గుంటూరు వచ్చినప్పుడు శ్రీహరి గారి కుమారుడు వెంకట రమణ రావుచేత ఒక బొమ్మ గీయించారు. అతను మూగవాడు చెముడు కూడా ఉండేది.

అతను స్వామి ఆజ్ఞతో వేశాడు. "చాలా బాగుంది రా" అన్నారు. అతనికి సంజ్ఞలతో ఒక చిత్రం గీయమని చెప్పారు. చుట్టూ నీళ్ళు, మధ్యలో పద్మం, పైన ఓంకారం, చుట్టూ సూర్య కిరణాలు ఉండాలని చెప్పారు. ఆ మూగ మనసు నిండా గురుదేవుని నిల్పుకొని స్వామి చూపించిన చిత్రం గీశాడు. చాలా బాగా వచ్చింది. బాబు "ఇది మనం గుర్తు పెట్టుకుందాం రా." అన్నారు. సత్యవాక్పరిపాలకుడైన గురుదేవుడు నాటి మాట నేడు ఆశ్రమ చిహ్నంగా ఆ చిత్రం అవతరించింది.

3.) పాండుగారింట్లో ఒక పౌర్ణమి నాడు శ్రీబాబు సభలో కృష్ణ తత్త్వం గురించి చెబుతూ "బుల్లి కన్నయ్య అల్లరి పనులకు విసిగిన గోపాలురు కొందరు వానిని భోషాణంలో పెట్టి బంధించి, వాని దుండగాలను విప్పి చెప్పాలని యశోదమ్మ దగ్గరకి ఆ భోషాణాన్ని నలుగురు మోసుకెళ్ళారు. దాని పైన మూత రాకుండా ఆరుగురు కూర్చున్నారు. మనో బుద్ధి చిత్తా హంకారాలు, అరిషడ్వర్గాలు" అని చెప్పారు. యశోదమ్మ నమ్మలేదు. 'ఇదిగో కావలిస్తే చూడు!' అంటూ మూత తెరిస్తే అందులో ఏమీ లేదు.

'నా బిడ్డ నా దగ్గిరే ఉన్నాడు' అని వెనుక దాగి కూర్చున్న కన్నయ్యను చూపించింది ఆ తల్లి. ఇలా అతి మనోహరంగా వర్ణించి చెప్పే ఆ లీలలు వింటూ ఆనందంలో మునిగిపోయారు భక్తులు.

ఆరోజే సభకు వచ్చిన ఒక భక్తుడు అంతా విని చివరికి 'ఇంతకీ ఆ భోషాణం ఏం చేశారంటారు?' అని శ్రీబాబుని ప్రశ్నించాడు. "అది మళ్ళీ వాళ్ళింటికి జాగ్రత్తగా చేర్చారు లెండి. మరి ఇనుము చాల ఖరీదు కదా. ప్రతిదీ ధరలు మండిపోతున్నాయి కదా ఈరోజుల్లో" అన్నారు శ్రీబాబు. సభ అంతా ఘొల్లు మంది నవ్వులతో.

4.) ఒక పౌర్ణమికి గుంటూరు చేరిన భక్తులతో శ్రీబాబు అందరినీ కోటప్ప కొండకి బయలుదేర తీశారు. కోటప్ప కొండపైన రాజావారి మేడ ఉంది. అక్కడి నుంచి చూస్తే శ్రీకోటీశ్వరుని దేవాలయం కనిపిస్తుంది. అక్కడ కరెంట్ లేదు. పెట్రోమాక్స్‌లైట్ల కాంతిలో పని జరిపారు.

ఆ మరునాడు దేవాలయంలో స్వామిని దర్శించి భక్తులంతా శ్రీశైలంలో వలె లింగాన్ని తాకి నమస్కరిస్తుంటే అక్కడ అర్చకులు "ఆడవాళ్ళు తాకరాదు. ఆయన దక్షిణామూర్తి స్వరూపుడు" అని గొడవ చేశారు. ఆ రాత్రి స్వామి మేడ మీద తమ గదిలో విశ్రమించారు. గురువుగారు స్వామికి భోజనం పెట్టాలని పెట్రోమాక్స్‌లైట్ తీసుకుని స్వామి గదికి వెళ్ళారు. కొంతసేపటికి గురువుగారు ఆనందంతో వెలిగిపోతున్న ముఖంతో బయటకి వచ్చి మా అందరితో " ఈ రోజు నా జీవితంలో మరుపురాని రోజు. శ్రీబాబు అఖండమైన తేజస్సుతో వెలిగిపోతూ దశావతారలలో విశ్వరూపం చూపించారు" అని చెప్పి మమ్మల్నందరిని బ్రహ్మానందంలో ఓలలాడించారు.

–సశేషం

# శ్రీమాతాజీతో యూరప్ యాత్ర

(గత సంచిక తరువాయి)

– డాక్టర్ సుధారాణి

వర్షం కురుస్తూనే ఉంది. బస్సు దిగి క్రూయిజ్ ఎక్కిన తరువాత అమ్మ సూర్యనమస్కారాలు చేయటం మొదలు పెట్టారు. వర్షం ఆగిపోయింది. మళ్ళీ బస్సు ఎక్కిన వెంటనే వర్షం ప్రారంభం అయింది.

ప్రపంచంలో అతి సుందరమైన, సంపన్నమైన దేశం స్విజ్జర్‌లాండ్. హొటల్‌లో లాబీలో అమ్మ సత్సంగం. సంస్కారవంతుడైతే నాస్తికుడైనా భగవంతుడు అతని వెం టపడి ఎలాగైనా అతని దృష్టిని మరల్చి తన సన్నిహితునిగా చేసుకున్న ఉదంతాన్ని వివరిస్తూ బోధ చేశారు శ్రీమాతజీ.

ఆల్ప్స్ మంచుకొండల ప్రకృతి సౌందర్యాన్ని గమనిస్తూ ఎత్తైన కొండలపైన కట్టిన రైలు స్టేషన్‌కి ప్రయాణాన్ని సాగిస్తూ గురుస్తుతి చేస్తూ ప్రకృతిలో అణువణువునా పరమాత్మను ఎలా దర్శించాలో బోధించారు. "మరి విశ్వవ్యాప్తమైన పరమాత్మ ఒదిగి గురు రూపంలో వచ్చి మిమ్మల్ని ఉద్ధరిస్తాను రండి అంటే ఆయనని మీ మనస్సులో బంధించలేకపోతే ఏం లాభం? అలా చేసినవారి జీవితంలో చింతలు ఉండవు. భగవచ్చింతనే ఉంటుంది. చూశారా! ఆ మంచు ఎలా తెల్లగా స్వచ్ఛంగా ఉందో, మన మనస్సు కూడా అలాగే ఉండాలి" అన్నారు.

తమ బోధని కొనసాగిస్తూ "నీకు ఆకలి వేస్తోందని ఎలా గుర్తిస్తావు? నీ కడుపులో ఏదో మంటవలనే కదా. కడుపులో మంటని ఎలా గుర్తిస్తున్నావు? మనస్సుతో అని అనుకుందాం. మరి ఆ మనస్సుని గుర్తించటానికి ఆధారం బుద్ధి లేదా తెలివి అని సమాధానం వచ్చిందనుకోండి ఆ తెలివి లేదా బుద్ధియే నారాయణుడు అని భావన చేయాలి" అన్నారు.

జూన్ 15వ తేదీ ఆస్ట్రియా దర్శించాము. ఆ తరువాత 16వ తేదీ ఇటలీలో వెనీస్ నగరంలో పడవ ప్రయాణం ఆనందంగా ఉంది. "పడవెళ్ళిపోతోందిరా! ఓ మానవుడా! దరిచేరే దారేదిరా!..." అని పాడుతూ "ఈ భవసాగరంలో మనమంతా ఈ ఉపాధి అనే పడవలో ప్రయాణం సాగిస్తున్నాము. మరి మనం కూడా మన గమ్యస్థానం చేరుకోవాలి కదా!" అన్నారు.

జూన్ 18వ తేదీన ఇటలీలో 'రోమ్' నగరం సందర్శించాము. వెటికన్ సిటీలో ఉన్న పోప్ భవనాన్ని సందర్శించాము. "మానవుని బుద్ధ భగవానుడు ఎక్కడ ఉన్నాడా అని దేశదేశాలు సందర్శిస్తారు. కాని నీతోనే, నీలోనే ఉన్న ఆయన్ని గుర్తించలేరు. నిన్ను అనుక్షణం సంరక్షిస్తూ, నడిపిస్తూ ఉండే గురుపరమాత్మని గుర్తిస్తే నీకు తిప్పలు

ఎందుకు?" అని సద్గురుదేవులు శ్రీబాబూజీమహరాజ్ అనేవారు అని అమ్మ చెప్పారు.

ఆఖరిరోజున మాతో యాత్రలో పాల్గొన్న ఉత్తరదేశమిత్రులు, యాత్రకి తోడ్పడిన మేనేజర్ అభ్యర్థన మేరకు అమ్మ సంకీర్తన చేసి అందరినీ ఆనందంలో ముంచెత్తారు. "ఈ దేహము ప్రకృతి యొక్క బాహ్యసౌందర్యాన్ని చూసి మోసపోకండి. ఈ సౌందర్యం వెనుక ఉన్న ఆత్మసౌందర్యాన్ని దర్శించండి. అలా దర్శించనివ్వకుండా మాయ అడ్డు పడుతుంది. మాయని మనం తొలగించుకోలేము. మాయని తొలగించగల సమర్థుడైన సత్య గురుదేవుని ఆశ్రయించాలి" అన్నారు.

జూన్ 20వ తేదీ నుండి 24వ తేదీవరకు దుబాయ్, అబుదాబి, షార్జా దేశాలను సందర్శించాము. అమ్మ చివరిగా మాట్లాడుతూ "ఈ బ్రహ్మాండంలో మనం చూసినదెంత? మనం చూసినదానికెంతో ఆనందపడిపోతున్నాము. అనంతమైన విశ్వంలోని సౌందర్యం అంతా సద్గురు స్వరూపిణి ఆ జగన్మాత త్రిపుర సుందరి 'పదకమల సౌందర్యంతో పోల్చగల్గుతారా!' అన్నారు. "అట్టి సౌందర్యాన్ని దర్శించే సాధనా సంపత్తిని ప్రసాదించగల సమర్థులు సద్గురు మూర్తికి ప్రణమిల్లుతూ ముగిస్తున్నాను."

జై గురుదేవ్!!

# లెక్కని జవాబు!

''మన పట్టణంలో ఎన్ని పక్షులు ఉన్నాయో రేపు లెక్కించుకుని రండి. లేకపోతే ఉద్యోగంలో నుంచి తీసేస్తాను'' అన్నాడు అక్బరు.

అంతా కంగారు పడ్డారు. బీర్బల్ మాత్రం నవ్వుకున్నాడు తనలో తాను.

మరునాడు వరుసగా అందరినీ అడిగి, మౌనంగా ఉండటం వలన అందరినీ డిస్మిస్ చేశాడు అక్బరు.

బీర్బల్ వంతు వచ్చింది.

"లక్షా, డెబ్భైరెండువేల, మూడువందల, ముప్పైరెండు (1,72,332) లెక్కని జవాబు చెప్పాడు బీర్బల్.

"ఎక్కువ తక్కువ అయితేనో?'' ఆశ్చర్యంగా అడిగాడు అక్బర్.

"ఎక్కువైతే పొరుగూరు నుంచి వచ్చినట్లు, తక్కువైతే పొరుగూరు వెళ్ళినట్లు'' అని ధీమాగా చెప్పాడు బీర్బల్.

విస్తుపోవటం అక్బరు వంతు అయింది.

# శ్రీకృష్ణ కర్ణామృతం

- సుశీలా ప్రసాద

కాలం గడిచింది. గర్భవతి అయిన చిత్రని ప్రసవ సమయానికే పంపుతామని అత్తవారు అన్నందున నిండుచూలాలిగా గోకులానికి వచ్చింది చిత్ర. నేను తనని కలిసినప్పుడు మధురలో తన మధురానుభవాలను వర్ణించి చెప్పింది చిత్ర. నల్లనయ్య తనని ఎప్పుడూ వదలకుండా వెంట వెంటే తిరుగుతూ ఉంటాడని, అందుకని ఏ పనిచేసినా స్వామికే చేసినట్లు ఉంటోందని, ఏ రూపాన్ని చూసినా నల్లనయ్య రూపమే కనిపిస్తోందని చెప్పింది. ఆమె మాటలు వింటూ ఆమె విశ్వాసమే ఆమెకు రక్షణగా ఉందని అనుకున్నానునేను.



ఈ రోజు సంధ్యవేళ .... నా మాట నా నోట్లోనే నిలిచిపోయింది. కన్నయ్య వచ్చి సరాసరి కదంబవృక్ష మూలంలో తిన్నెమీద కూర్చున్నాడు. అంతాలేచి వెళ్ళి తన కెదురుగా నిలబడ్డాం. ఎవరి వంకా చూడకుండా చేతిలో మురళీ అటూఇటూ తిప్పుతూ "ఎందుకిలా వచ్చారు?" అన్నాడు. క్షణంలో సగం సేపటిలో అందరి గుండెల చప్పుళ్ళూ ఆగిపోయినట్లయ్యాయి. నిశ్శబ్దం ఆవరించింది. "ఎవరూ మాట్లాడరేమి?" అన్నాడు మళ్ళీ తానే.

మౌనాన్ని ఛేదిస్తూ నేను మాట్లాడాను 'ప్రభూ! ఇదేమి పరీక్ష? లౌకికమైన కోరికలతో మేము రాలేదు. ఇహ భోగాలన్నీ నువ్వు మాకు పుష్కలంగా ఇచ్చావు. ఎన్ని సుఖాలను అనుభవిస్తున్నా వాటిల్లో స్థిరమైన ఆనందం లేదని, అనుభవపూర్వకంగా తెలుసుకునే తెలివిని కూడా నీవే మాకిచ్చావు. కాబట్టి వాటిని ఆశించకుండా శాశ్వతమైన ఆనందం కావాలంటే, అది పరమపురుషుడవైన నీ దగ్గరే ఉందని గ్రహించే జ్ఞానాన్ని కూడా నీవే మాకు దయచేశావు. నీతో సంభాషణ, నీ సాన్నిధ్య భాగ్యం, మాకు పరమమైన తృప్తినీ, సుఖాన్నీ అందిస్తున్నాయని, మా యీ ఉపాధులన్నీ నీ ఉపకరణాలుగా భావించి, నిన్నే నమ్మి సేవించుకుంటూ వస్తున్నాము.

నీ యెడల గాఢమైన విశ్వాసమనే మొలకను, అత్యధికమైన ప్రేమ అనే నీరు పోసి పెంచుకుంటూ వస్తున్నాము. అది మొక్కగా అయి, మానుగా అయి, పుష్పించి, ఫలించే సమయంలో నువ్వు ఈ ప్రశ్న వేశావు. ఇది నీకు న్యాయమేనా స్వామీ?' మా అందరి మనస్సులు ఏకం చేసి పలికే వాక్యాలతో నా గొంతు గద్గదమైంది. అందరి కళ్ళల్లో వెన్నెల్లో మెరుస్తూ ముత్యాల్లాంటి ఆనంద బాష్పాలు రాలాయి.

ఆ క్షణంలోనే నీలమేఘశ్యాముడు కిలకిలా నవ్వేశాడు. "మీ ప్రగాఢమైన విశ్వాసాన్ని, ప్రేమను పరీక్షించేందుకే సంకల్పించి అలాగ ప్రశ్నించాను" అన్నాడు. ఇప్పుడు మీ అందరి మనోభావాలనే రత్నాలను ఏరుకుని, నా మనసనే మరకత

మంజూషలో భద్రపరచుకుంటాను. నిజంగా మీరంతా ధన్యులు! మీరు జన్మలేని ముక్తిని అందుకుంటారు."

అందరి హృదయాలు సేదతీరాయి. ఏకకంఠాన "దేవా! నీ లీలలు, మాయలు తెలుసుకోగలిగిన వారెవరయ్యా?" అన్నాము. అందరిలో ఇప్పుడు ఆనందం వెల్లివిరిసింది. తామరపూవు బొడ్డుని చుట్టి ఉండే రేకులలాగ అందరి మధ్యలో ఉన్న కృష్ణుని చుట్టి కూర్చున్నాము. 'నీలీలలు తెలుసుకోవటానికి ప్రయత్నించగలరేమో కాని, నీ మాయను మాత్రం తెలుసుకోలేరు కన్నయ్యా!' అన్నాను. "ఓహో! నీ అనుభవమేదో చెప్పబోతున్నావా?" అన్నాడు కృష్ణుడు నవ్వుతూ. 'అవును' అన్నాను నేను. "అయితే కానీ!" అన్నాడు. అందరూ వినటానికి ముందుకు జరిగారు.

"ఇంతకు ముందే ఈ నాటి సంధ్యవేళ చిత్రకి నొప్పులు మొదలైనాయి. గౌరమ్మ ఇరుగు పొరుగు అందరిని బిడ్డ ప్రసవ సమయంలో సాయం చేయమంటూ పిలిచింది. ఆ అందరిలో నేనూ ఉన్నాను. చాలా సమయం వరకు ప్రసవం కాలేదు. చిత్ర కళ్ళు మూసుకుని, నోరు తెరచి 'కృష్ణా! కృష్ణా!' అంటూ ఆపకుండా పలుకుతుంటే గౌరమ్మ ఓర్చలేక, ఒళ్ళు జలదరిస్తుంటే, 'నోరాపవే తల్లీ! నీరసం వస్తుంది' అంటూ విలవిలలాడింది. ఆవిడకి కాళ్ళూ చేతులూ ఆడటం లేదు. అందరూ చేరి ఏవో సలహాలు ఇచ్చేస్తున్నారు. ఆ సమయంలో ....." నేను చెప్పటం ఆపి నల్లనయ్య వంక చూశాను. అతడు స్థిరంగా పిల్లనగ్రోవిని ఆడిస్తూ ఉన్నాడు. అదే అంగీకారమని భావించాను.

"ఒక నడివయస్సు స్త్రీ లోపలికి వచ్చింది. చాలా అందంగా ఉంది. ఎవరన్నట్లు అందరూ తన వంకే చూసేసరికి, ఆమె 'మాది మధుర. చిత్ర అత్తగారికి చెల్లెలిని అవుతాను. చిత్రంటే నాకెంతో అభిమానం, ప్రేమ. తను అంది "ప్రసవ సమయంలో నాకు తోడు ఉంటావా?" అడిగింది చిత్ర. అందుకే ఇల్లు కనుక్కుని వచ్చాను. ఏదీ చిత్ర ఎలా ఉంది?' అంది. ఆమె మాటలు విని వచ్చిన గౌరమ్మ పురిటింటి తలుపు తెరుచుకుని వచ్చింది బైటకి. వస్తూనే 'ప్రసవం కావటం లేదు. ఎవరమూ ఏమీ చేయలేక పైన ఆ దేముడే ఉన్నాడు అనుకుంటూ ఇలాగ ఉన్నాం. ఆ దేముడిలా వచ్చావు. నువ్వు చూడు తల్లీ!' అన్నది కళ్ళనీళ్ళతో.

'ఏమీ భయం లేదు. నేను చూసుకుంటాను. నాకు అన్నీ చాతనవును' అంటూ గౌరమ్మ చూపగా లోపలికి వెళ్ళి తలుపులు చేరవేస్తూ 'మీరంతా ఇక్కడే ఉండండి' అంది. కొంత సమయం గడిచింది. లోపల ఏం జరుగుతున్నదో తెలియలేదు. నేను ఆత్రంగా చూస్తున్నాను. ఆమె పిలవలేదు.

గౌరమ్మ ఆగలేక లోపలికి తొంగి చూస్తే, ఆవిడ ఎక్కడా లేదు. చప్పున లోపలికి వెళ్తుంటే నేనూ వెళ్ళాను తనతో. లోపలంతా కలయజూస్తే ఎక్కడా వచ్చినావిడ జాడ లేదు. గౌరమ్మ, నేను చిత్ర వైపు నడిచాము. తను కళ్ళు మూసుకుని పడుకుని ఉంది. పక్కలో పండంటి పసిబిడ్డ కదులుతోంది. గౌరమ్మకి సంతోషంతో కళ్ళు ధారా ప్రవాహాలు

అయ్యాయి. చిత్రని కుదుపుతూ 'అమ్మా! లే! ఆవిడ ఎవరో నీ చుట్టం, నీకు తోడుగా ఉంటానని వచ్చింది. తనెక్కడ?' అని అడిగింది. నేను చిత్ర వంక చూశాను. మొహం అంతా ఆనందంతో నిండి ఉన్నది. "ఆవిడెవరు? నేను చూడలేదు. నా తలపై చెయ్యి పెట్టి 'నీకేమీ భయం లేదు. నిన్ను చూసేందుకు నేనున్నాను' అంటూ నా తలవైపు నిలబడ్డ నా దేముడు కృష్ణుణ్ణి చూశానంతే. ఇంకేమీ తెలియదు" అంది చిత్ర.

అంతా అయోమయంగా ఉంది గౌరమ్మకి. నోరు తెరచి అట్లాగే ఉండి పోయింది. 'కృష్ణా! అంటూ పాతపాటే పాడుతున్నావు. లోపలికి వచ్చినావిడని నీవు చూడలేదా? ఆవిడ ఎక్కడా కనిపించదే?' అంటూ చిత్రని మళ్ళీ మళ్ళీ ప్రశ్నించసాగింది.

"నా పాటకి పాత కొత్తలు లేవు. నా తలమీద చెయ్యి పెట్టినప్పుడు కన్నయ్య చేతిని గట్టిగా పట్టుకున్నాను. అలా పట్టుకోగానే నా బాధ తగ్గిపోయింది. ఎంతో సుఖంగా అనిపించింది. తెరిపి మరిపిగా ఉన్న ఆ వేళ కన్నయ్య నెమ్మదిగా నా చేతి పట్టును వదిలించుకోవటం గమనించాను. అప్పుడు నా చేతిలోకి జారివచ్చిన ఆ ప్రభువు చేతి కంకణం ఇదిగో కావాలంటే చూడు" అంది చిత్ర చేయి జాపుతూ. చిత్ర చేతిలోని పిడికిట కన్నయ్య రత్న కంకణం మిలమిల మెరుస్తూ కనిపించింది.

అంతా చూస్తూ, వింటున్న నాకు బ్రహ్మానందమైపోయింది. గౌరమ్మకి అది చూసి మతిపోయింది. వచ్చినావిడ కృష్ణుడే! ఎవరో కాదు అన్న విషయం ఇప్పుడు మాయా నాటక సూత్రధారి ఆమె 'మతి' ని 'సుమతి' గా మార్చేందుకే అని గ్రహించ గలిగింది. చిత్ర చేతిలోని కంకణాన్ని కళ్ళకద్దుకుని, గుండెకు హత్తుకుని, 'ఇన్నాళ్ళూ నేను చేసిన తప్పులన్నీ క్షమించి, నా బిడ్డని కాపాడావు. పండంటి బిడ్డని ప్రసాదించావు. నా కళ్ళు తెరిపించావు' ఆనందంతో గంతులేస్తున్న మనస్సుతో గౌరమ్మ చెప్పింది. కన్నయ్యను తలచుకుని రెండు చేతులూ జోడించింది తొలిసారిగా.

నేను బైటకి వచ్చేసరికి ఆక్కడ ఉన్నవారంతా వచ్చినావిడగురించి ఏమి అడగ లేదు. ఏమీ జరుగనట్లే ఉన్నారు. చిత్రకి బిడ్డ కలిగిందని విని సంతోషించారు. ఇదంతా నీ మాయా ప్రభావమేనా ప్రభూ!" అంటూ నంద గోపాలుని వంక చూశాను. నా మాటలు పూర్తి అయ్యేసరికి వంశీధరుని మోహన మురళీ విజృంభించింది. సర్వసృష్టిని అమృత లహరులలో ముంచివేస్తున్నది. 'నా మాయ అతిక్రమించరానిది. నన్ను శరణనన్న వారు మాత్రమే నా మాయను దాటగలరు' అనే స్వామి సందేశం అందులో ఇమిడి ఉన్నది.



# అధికులెవరు?

– సుశీలా ప్రసాద

శ్రీకృష్ణ పరమాత్మ తన ముందు అంజలి ఘటించి నిలిచిన వారిని చూస్తూ చిరునవ్వు  చంద్రికలు వెదజల్లాడు. అలా విరసిన ఆ వెన్నెల వెలుగులు, వారి అంతరాలలో కమ్ముకున్న అహంకారపు చీకట్లను తొలగించటానికే కావచ్చు. ఇంతకీ విషయం ఏమిటంటే, ఆ నిలచినవారు దేవగణాలలో ప్రసిద్ధులైన తుంబుర, నారదులు. వారు శ్రీకృష్ణుని ఒక ప్రశ్న అడిగారు. 'మాలో సంగీత విద్యలో అగ్రగణ్యులెవరు?' అని.

యదుసింహుడు ఒక్క క్షణం ఆలోచిస్తున్నట్లు నటించగా, వారిద్దరికీ 'చిన్నతనం నుంచీ చిలిపి చేష్టలు చేయటానికి అలవాటుపడిన కొంటె గోపాలుడు కదా, తమకెలాంటి సమాధానం చెబుతాడో' అనిపించింది. అలాగే అనుకున్నంతా అయింది. మురళీధరుని అధరాలు కదిలి, "చూడండి! మీకు మీ ప్రశ్నకి సరియైన సమాధానం కావాలనుకుంటే, న్యాయనిర్ణయం జరగాలనుకుంటే గంధమాదన పర్వతంపైన ధ్యాన నిమగ్నుడైయున్న ఆంజనేయుని వద్దకు వెళ్ళి, వానిని అడగండి" అనే వాక్యాలు వెలువడ్డాయి. తుంబుర, నారదులిద్దరూ అదివిని గతుక్కుమన్నారు. 'ఇదేమి వింత?' అని వారు మనస్సులో తలిచేలోపుగానే "నాకదే సమంజసంగా తోస్తోంది. వెళ్ళిరండి" అన్నాడు గోపాలుడు. తప్పని సరిగా తమకు సెలవు దయచేసిన ప్రభువుని వీడ్కొని వారు ముందుకి కదిలారు.

దారిలో ఇద్దరూ తర్కించుకోసాగారు. 'అయినా హనుమంతుడు శ్రీరామపద సేవా దురంధరుడు, స్వామి కార్య నిర్వాహకుడు, తారకనామ మధురాన్ని తనివితీరా గ్రోలేవాడేగాని, ఆయనకి సంగీత విద్యలో ఏం ప్రవేశముందని? అతగాడు గానకళా కోవిదుడని మనమెరుగమే!' వారిద్దరి మాటలకు, అహంకార పూరితులైన వారి మనసు లోనే దాగిఉన్న మాయ పకపకా నవ్వుకున్నది.

వారిద్దరూ యదుకుల తిలకుడు సూచించిన పర్వత ప్రాంతానికి చేరుకుని చుట్టూ కలయ చూశారు. వారికి అనతి దూరంలోనే ఒక కొండ చరియపై పద్మాసనస్థుడై ఉన్న ఆంజనేయుడు కనిపించాడు. ఆయనను సమీపించి, ఎలా ఆయనను మేల్కొల్పాలా అని సందేహిస్తున్న తుంబురనారదులకి, అతి మెల్లగా నడచిన తమ అడుగుల సవ్వడి అలవోకగా విని మారుతి కనులు తెరిచి, 'నా ప్రభువు ఆదేశానుసారం ఇలా వచ్చిన మీకు నా నమోవాకాలు అర్పిస్తున్నా' అంటూ చేతులు జోడించి పలికాడు. గాయకులిద్దరూ ఆశ్చర్యపోయారు. 'అయితే మేము వచ్చిన పని కూడా మీకు తెలిసే ఉంటుంది' అన్నారు.

'అవును. అదీ స్వామి ఆజ్ఞగానే నేను శిరసా వహిస్తున్నాను.' అంటూ అంతలోనే గొంతు విప్పి మధురాతి మధురంగా మంద్ర మధ్యమ తార స్థాయిలలో తారక నామాన్ని గానం చేస్తూ మైమరచిపోయాడు. కళలరాశి వాణి వాని స్వరంలో కొలువై ఉన్నదా అన్నట్లుంది ఆ గాన మాధుర్యం. విస్మితులై వింటూ వారిద్దరూ, తమ ప్రశ్నకి సమాధానం ఎలాగ ఎప్పుడు లభిస్తుందని ఆలోచిస్తూ అలాగ నిలిచిపోయిన కొంచెం సమయానికి వారికి మరింత వింత ఎదురైంది. హనుమ గానానికి వారి చుట్టూ ఉన్న పర్వత శిలలన్నీ కరిగి వాగులై, ఏరులై ప్రవహించ సాగాయి. పవనసుతుడు అంతలో తన గాన వాహినిలో ఓలలాడుతున్న తుంబుర నారదులిద్దరినీ వారి వీణలను తనకిమ్మని సంజ్ఞ చేశాడు. నారదుని మహతి, తుంబురుని కళావతి చేతికందగానే ఆ రెంటినీ పరిగెడుతున్న ప్రవాహంలో విసిరేశాడు. అవి నీటిలో తేలియాడుతూ కదిలిపోతుండగా పావని చటుక్కున తన పాట ఆపివేశాడు. తక్షణమే ఎదుట ఉన్న జలమంతా గడ్డకట్టిపోయింది. వాటి మధ్య వీణలు రెండూ చిక్కుకుని పోయాయి. 'చూడండి. ఇప్పుడు మీరిద్దరూ మీ సంగీత ప్రావీణ్యాన్ని చూపించి శిలలను కరిగించి అవి ప్రవాహమైన ఆ నీటి నుంచి మీ వీణలను తీసుకోండి. ఎవరు పాడితే శిలలు కరిగిపోతాయో వారే గానకళా విశారదులలో అగ్రగణ్యులని తేలిపోతుంది. ప్రకృతే మీకు సమాధానం చెబుతుంది. ఇక కానివ్వండి అన్నాడు హనుమంతుడు.



తుంబుర నారదులిద్దరూ మొహమహాలు చూసుకున్నారు. వారి ముఖాలలో పట్టుదల ప్రస్ఫుటంగా గోచరించింది. మొదటగా నారదుడు తన గానాన్ని సాగించాడు. తన కళనంతా ప్రదర్శించాడు. కానీ, చిన్నరాయి కూడా చితకలేదు. బండరాళ్ళు అలాగే నిలచి ఉన్నాయి. ఇక తుంబురుడు తన సంగీత కళలోని మెలకువలన్నీ కుమ్మరించాడు. అయినా ప్రయోజనం లేదు. ఇలాగ ఒకరితరువాత ఒకరు! అయినా అణువంతైనా శిలలు కరుగలేదు. వారి శక్తి తరగిపోసాగింది. కాలం గడిచేసరికి వారికి మనస్సులో మాయ తొలగి, అహంకారం కరిగిపోయింది. ఇద్దరూ సిగ్గుతో తల వంచుకున్నారు.

'స్వామి నిర్ణయం సరియైనదని మాకిప్పుడు అర్థం అయింది. మాకు కనువిప్పు కలిగించటానికే నీదగ్గరకి పంపారు. ఓ మహానుభావా! దయచేసి మా వీణలు మాకిప్పించు!' అని ప్రార్థించారు. వినయభూషణుడైన హనుమంతుడు వారిని మన్నించి తిరిగి గళం విప్పాడు. మరోమారు సర్వప్రకృతిని పులకింపచేస్తూ భువి నుండి దివిదాకా హనుమగానం మారుమ్రోగింది. ఆ గానామృతఝురులలో ఒకే నాదం సుస్వరమై వినబడసాగింది. "అహంకార రహితుడు ఆనంద పూర్ణుడు"

*

# స్థిత ప్రజ్ఞుడు

- పరాశర ప్రసాద్

సాధనలో కూర్మ ప్రమాణము అనుకూలమైనది. కూర్మము పరుగులు పెట్టదు. ఎదుర్కొనదు. సహనం కావాలి. రాగద్వేషాలతో కూడిన దృష్టి ఉండకూడదు. నిరాహారం చేసినంత మాత్రాన, ఇంద్రియాలను నిగ్రహించినంత మాత్రాన స్థితప్రజ్ఞుడు కాజాలడు. మనస్సు వాసన రహితం కావాలి. బలవంతంగా కోర్కెలను చంపుకున్నంత మాత్రాన సంకల్పం సమసిపోదు. అది బీజరూపంలో ఉండి సమయం వచ్చినప్పుడు అంకురిస్తుంది.

జ్ఞానేంద్రియాలతో శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాలనే ఆహారం తీసుకోకపోతే వాసన పోతుంది. ఇంద్రియాలు బలవత్తరమైనవి. అవి మనస్సుని తస్కరిస్తాయి. అంతిమ శ్వాస విడిచేవరకు మాయ నీ వెంట పడక తప్పదు సుమా!

శరీరానికి వయస్సు ఉందికాని, ఇంద్రియాలకు వయస్సుతో నిమిత్తం లేదు. ఒకడికి ములక్కాడ అంటే ఇష్టం. కానీ అతడు కాశీలో గంగలో ములక్కాడని వదిలిపెట్టాడు. తినటం మానేశాడు. ఒకనాడు స్నేహితుడి యింటికి వెళ్ళాడు. ఆరోజు మార్కెట్ బంద్. స్నేహితుడి ఇంట్లో, కూర, సాంబార్ అన్నీ దొడ్లోని ములక్కాడలతో చేశారు. తీరా భోజనం చేసే సమయం ఆసన్నమైంది. ములక్కాడ కాశీలో వదిలేసిన విషయం జ్ఞాపకం వచ్చింది. ఎలాగా అని ఆలోచించాడు. మనస్సు ప్రబోధన చేసింది. కాశీలో వదిలినది పచ్చి ములక్కాడ కదా! ఉడికినది కాదు కదా ఫరవాలేదులే! అని. చూశారా అదే వాసన! అది తొలగనంత వరకు మానవుడు మనసుకు దాస్యం చేయవలసినదే.

శరీరమనే రథానికి ఇంద్రియాలు గుఱ్ఱాలు. రథసారథిగా బుద్ధి ఉంటే గుఱ్ఱాలు అదుపులో ఉంటాయి. అంతేకాని మనస్సు రథసారథి అయితే గుఱ్ఱాలు అదుపు తప్పి, జీవుడు గమ్యాన్ని చేరుకోలేడు.

జ్ఞాన యజ్ఞం గొప్పది. దానికి శ్రద్ధ కావాలి. ధనం అవసరం లేదు. దానికి బోధ హవిస్సు. సామాన్య మానవుడు తినటం, త్రాగటం, నిద్రించటం మొదలగు ప్రక్రియల యందు ఆసక్తి కలిగి ఉంటాడు. స్థిత ప్రజ్ఞుడు వాటియందు ఆసక్తి చూపడు. సాగరం చూడండి తనలో ఎంత నదీజలం వచ్చిచేరినా పొంగిపోదు. రాకపోయినా చింతించదు. అలాగే స్థితప్రజ్ఞుడు సుఖదుఃఖాలకు, రాగద్వేషాలకు అతీతుడు.

విషం త్రాగితే ప్రమాదం. కాని విషయం చూస్తేనే ప్రమాదం. ప్రాపంచిక విషయాలకు మనస్సులో స్థానం యిస్తే, ఆధ్యాత్మిక చింతన తగ్గిపోతుంది. నిద్రించే ముందు ఉత్పన్నమైన సంకల్పం, నిద్రలో బీజరూపంలో ఉంటుంది. మెలకువ వచ్చిన

తరువాత ప్రకటిత మవుతుంది. సంకల్పం మంచిది కావచ్చు, లేదా చెడుది కావచ్చు. జాగ్రతావస్థలో అది బహిర్గత మవుతుంది. స్వప్నావస్థలో అది మనస్సులో ఉంటుంది. సుషుప్తిలో బీజరూపంలో ఉంటుంది. రాగద్వేషాలు లేని కర్మ ప్రారబ్ధకర్మ కానేరదు. దీనికి దృష్టాంతంగా కరెంట్ ఉండగా తిరిగే ఫ్యాన్ కరెంట్‌పోయినా కొద్దిసేపు తిరుగుతుంది. అటువంటి కర్మ, కర్మలో అకర్మ.

మమకారముతో అహంకారము కూడి ఉంటుంది. అంధుడిని భోజనానికి పిలిస్తే, వాడిని తీసుకురావటానికి తోడుగా రెండోవాడు కూడా వస్తాడు. అలాగే మమకారం వెంటే అహంకారం కూడా ఉంటుంది.

కర్మవాసనలు రహితమైన మనస్సు నిర్వాణ స్థితిలో ఉంటుంది. అక్కడ మార్పులకి స్థానం లేదు. అటువంటి స్థితిగల మనస్సు ఉన్నవాడు స్థితప్రజ్ఞుడు. ఈ దేహమనే ఆవరణ లేనివాడు. అటువంటివాడు అంతాతానే, ఏదీ తనది కాదు అన్నట్లు ఉంటాడు, అదే స్థిత ప్రజ్ఞత్వం. అతడే స్థితప్రజ్ఞుడు.

హరిః ఓమ్ తత్సత్!

శ్రీసద్గురు ప్రసాదిత (50వ.) సర్ణోత్సవ శ్రీరాధాకృష్ణ జన్మాష్టమి మహోత్సవములు
శ్రీ సద్గురు భాగవత, అఖండనామ సప్తాహ, త్రయాహ్నిక సాధుధర్మ సమ్మేళన
సర్ణోత్సవ కార్యక్రమాలు

*స్వస్తి శ్రీ చాంద్రమాన శ్రీ విజయనామ సంవత్సర శ్రావణ బహుళ సప్తమి అనగా ది.27-8-2013 మంగళవారం నుండి 2-9-2013 సోమవారం వరకు సప్తాహ దీక్షతో శ్రీకాశీవనాశ్రమము నందు పూజా కార్యక్రమములు జరుపబడును. కావున ఏవన్మంది భక్తులు కార్యక్రమములో పాల్గొని తరించవలసినదిగా కోరుతున్నాము.*

<u>కార్యక్రమములు</u>

సప్తాహ్నిక శ్రీకృష్ణ మూలమంత్ర హెూమము, త్రయాహ్నిక సాధుధర్మ సమ్మేళనము, అఖండ సప్తాహ్నిక హరేరామ నామము, భాగవత ప్రవచనము, భగవద్గీతా పారాయణ ,మాతాజీవారిచే దివ్య అనుగ్రహ భాషణ ఉంటాయి.

2-9-2013న పూర్ణాహుతి, శ్రీరాధాకృష్ణుల సహస్రనామపూజ, శ్రీసద్గురుపాదపూజ జరుగుతాయి.

# జ్ఞానదీపం

– రత్నం

శ్రీబాబు మాట్లాడుతూ "నా చిన్నతనంలో దక్షిణాది వెళ్ళినప్పుడు మధుర మీనాక్షి ఆలయంలో ఒక యోగిని చూశాను. ఆయన జ్ఞాని, నిస్సంగుడు. మూల కూర్చుని ఎప్పుడూ ధ్యానం చేసుకుంటూ ఉండేవాడు. ఆలయ అధికారి మొదట ఆయన్ని చూసినప్పుడు ఎవరో సోమరి అనుకున్నాడు. కాని ఆ తరువాత కొంత గ్రహించుకున్నాడు. రోజూ ఇంత ప్రసాదం ఇచ్చేవాడు. ఆ యోగి అదే తిని అక్కడే కాలక్షేపం చేసేవాడు. ప్రసాదం ఇచ్చినప్పుడూ, ఇవ్వనప్పుడూ కూడా ఒకే విధంగా చిరునవ్వుతో ఆ అర్చకుని ఆశీర్వదించేవాడు.



ఆ అర్చకుడు చనిపోయాడు. అతని కొడుకు హయాం వచ్చింది. అతనికి యోగిని చూస్తే అసలే మంట. అతనివన్నీ అధునాతన భావాలు. 'ఇలా తిని సోమరిగా కూర్చోకపోతే, ఏదైనా పనిచేసుకోకూడదూ!' అని అతనికి వినబడేటట్లుగా తిట్టేవాడు. అయినా అలా చిరునవ్వుతోనే ఉండేవాడాయోగి.

దూషణకు చలించకపోవటం, ఎప్పుడూ ఎక్కడికీ వెళ్ళకపోవటం, చిరునవ్వుతో ఉండటం, ప్రసాదం యిచ్చినా, యివ్వకపోయినా అడగకపోవటం ఇవన్నీ గమనించి, ఇది సోమరితనం కాదని, ఆ యోగి నిత్యశాంతిని, తృప్తినీ పొందుతున్నాడని గ్రహించి ఆ కొత్త పూజారి రోజూ ప్రసాదం పెట్టి మరింత జాగ్రత్తగా చూసుకునేవాడు. అలా చూసినప్పుడు, చూడనప్పుడూ కూడా ఒకే రకమైన ప్రేమతో ఉన్నాడు యోగి. అదే స్థిత ప్రజ్ఞుని లక్షణం.

మహాత్ములను విమర్శించటం కర్మను మూటకట్టుకోవటమే. అసలూ ఏ మానవుని కూడా విమర్శించరాదు. దాని వలన మనకే నష్టం. అతడే తరువాత ఏ మహాభక్తునిగానో, మహాజ్ఞానిగానో మారి జీవకోటిని తరింపజేయవచ్చు. ఇతరుల విమర్శమాని, తన్ను తాను విమర్శించుకోవటం, తన తప్పులను, లోపాలను, వెదకి వెదకి పట్టుకుని దిద్దుకోవటం వలన మానవుడు ఎంతైనా మేలు పొందుతాడు.

పరమాత్మ దృష్టికలవాడు అలా తన్నుతాను దిద్దుకుని మసి తుడిచిన దీపం వలె ప్రకాశిస్తాడు. పరమాత్మ దృష్టిలేనివాడి మనస్సు మసిపట్టిన దీపం వలె ఉంటుంది. ఆధ్యాత్మిక చింతనగల యింటికి, అది లేని యింటికి కూడా అదే తేడా.

ఇదే కాదు. ఒక సంస్థ అయినా సరే, అందులోని ఉద్యోగులు ఆధ్యాత్మిక చింతన గలవారైతే, ఆ సంస్థ శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లుతుంది. యజమాని మనస్సులో

భగవానుడు ప్రవేశించి, ఉద్యోగులకు రావలసిన ప్రతిఫలాన్ని యిప్పిస్తాడు. ఇంక్రిమెంట్లు ప్రమోషన్లు అవే వస్తాయి. ఉద్యోగస్థులు కూడా కలిసికట్టుగా పనిచేస్తారు. యజమానికి ఉద్యోగస్థులకు మధ్య సద్భావన, సదవగాహన ఏర్పడతాయి. అంతేకాని, సమ్మెలు, లాకవుట్లు చేస్తే లాభం ఏమిటి? ఆధ్యాత్మిక చింతన లేనందువల్లన కలిగే నష్టమది.

మానవ శరీరం ఒక యంత్రాంగం. ఒక కారు వంటిదే. కారు కొత్తదే. ఖరీదైనదే. డ్రైవరు నేర్పరే కావచ్చు. కాని పెట్రోలు లేనిదే నడవదు కదా. అలాగే వేష భాషలు, పదవి, కండబలం, అందచందాలు ఎంత గొప్పగా ఉన్నా, ఆత్మ శక్తి లేనిదే శరీరం శవమే కదా!

పెట్రోలు ఉంటే కారు నడుస్తుంది. అలాగే ఆత్మ శక్తి శరీరంలో ఉంటే కంటిలో కన్నయై, చెవిలో చెవియై, ఇలా అన్ని యింద్రియాలను ప్రకాశింపజేస్తుంది. తాను మాత్రం సాక్షిగా ఉంటుంది. ఆ సాక్షిని మనం చూడలేము. తెలుసుకోలేము. జ్ఞాని మాత్రమే తెలుసుకోగలడు.

ఇప్పుడు ఇక్కడ మాట్లాడేది ఎవరు? బాబు అనే షర్టు వేసుకున్న జగన్మాత. సమస్త వేదాల, ఉపనిషత్తుల సారమేదో ఆ రస స్వరూపమైన పరమాత్మ తత్త్వాన్ని జగన్మాత మీకు బోధిస్తోంది. బాబు ఆమె ఒడిలో ముద్దుబిడ్డ. ఈ సింహాసనము అమ్మ ఒడి. ఇక్కడ కూర్చుని నేను కూడా మీకు మల్లె అమ్మ చెప్పేది వింటున్నాను. విని మననం చేసుకుంటూ ఆనందం పొందుతున్నాను.

సర్వాంతర్యామి అయిన అమ్మ లేనిదెక్కడ? మీ మీ వృత్తులలోనే మీరు జగన్మాతను దర్శించవచ్చు. పరమాత్మ శక్తిని అన్నిటిలో చూడవచ్చు. అట్టి జగన్మాత మీకు అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను, అఖండ ఐశ్వర్య భోగభాగ్యాలను ప్రసాదించి సర్వదా రక్షించుగాక! సుఖీభవ!! సుఖీభవ!!

## భక్తుడు - నాలుక

**భక్తుడు నాలుక లాంటివాడు అన్నాడు తులసీదాస్. నాలుక 32పళ్ళ మధ్యా తిరుగుతూ కూడా దెబ్బ తినదు. లోక వ్యవహారలలో భక్తుడు దెబ్బతినడు.**

**నాలుక అవసరం అయితేకాని బయటకు రాదు. భక్తుడు కూడా అవసరం అయితే కాని బయట పడడు.**

**నాలుకకు సంగ్రహ బుద్ధి లేదు. భక్తుడికీ అదే.**

**నాలుక రెండింతల పని చేస్తుంది. భక్తుడూ అంతే.**

# గుడగూచి

-శ్రీ పాల్కురికి సోమనాధుని 'బసవపురాణం' నుండి

కర్నాటక దేశంలో శివదేవయ్య అనే శివ భక్తుడు నిత్యమూ కుంచెడుపాలు శివాలయంలోని మహేశ్వరుడికి నైవేద్యం పెట్టేవాడు. శివదేవయ్య ఊరు వెళ్తూ, పదిసంవత్సరాల వయస్సుకల కూతురు గుడగూచిని పిలిచి, "అమ్మా! రోజూ గుడికి వెళ్ళి శివునికి పాలు ఆరగింపు పెట్టు తల్లీ! నీకు ఆటబొమ్మలు కొనుక్కుని వస్తాను" అని అప్పచెప్పాడు.

మరునాడు ఉదయమే గుడగూచి స్నానం చేసి, విభూతిరేఖలు దిద్దుకుంది. పాలుకాచి, కుంచెడు కొలిచి, కొంగు కప్పి, గుడికి వెళ్ళి, శివుని ముందుపెట్టి సాష్టాంగ పడింది. "ఆరగించు దేవా!" అని వేడుకొని బయటకు వచ్చి నిలబడింది. కాసేపు ఆగి గుడిలోకి వెళ్ళి చూసి కలవరపడింది. ఎలా పెట్టిన పాలు అలానే ఉన్నాయి. గుడగూచి కళ్ళవెంట నీరు కారుస్తూ యిలా అడిగింది...



"పాలేల ఆరగింపవు లింగమూర్తీ!
కాచుట చాలదో కమ్మవల్లమినో,
ప్రాచియో విరిగినో పడుచనేననియో ?
ప్రొద్దెక్కనో యెండబొగయు వచ్చెడినో?
బుద్ధిపుట్టదో నెయ్యి వోయకుండితినో?
కడువేడియో? నీరుగలసినవనియో?
ఎడవాద్యములులేక ఏన తెచ్చినవనో?
చాలవో యివి యాలపాలు గావనియో?
ఆరగింపగ బెట్ట నేరకుండితినో?
మిదువోయినవో మీగడలేదో?
యూరకే మిటికి బాలొల్లవు దావ?"

అంటూ పరిపరి విధాల వేడుకొన్నా గరళకంఠుడు పలుకలేదు, ఉలకలేదు. గుడగూచి

"గోపించు భంగించు గుప్పించునరచు
గటకటవాపోవు గరములు విరుచు
దటదట నేలతో నాటించు గోళ్ళు
ధారుణిబడి బయల్దన్నుచు నేడ్చు"

అటయనా సదాశివుని మనస్సు కరుగలేదు. గుడగూచి వజ్ర సంకల్పంతో " పరమేశ్వరా! ఈ పాలు ఆరగించకపోతే, కోపిష్టి తండ్రి నన్ను ఎలాగో చంపకపోడు; సందేహం లేదు.

ఆ చచ్చేదేదో యిక్కడే చస్తాను. ఆ పేరేదో నీకే దక్కుతుందిలే" అంటూ లింగానికి తల బాదుకుంటోంది.

పరమేశ్వరుడు ప్రత్యక్షమై ఒక చేత్తో గుడగూచి తల పట్టుకుని, ఒక చేత్తో పాలు ఆరగించాడు. గుడగూచి సంతోషంతో శివుని చేతిలోని కుంచాన్ని లాక్కుని, కోపాన్ని నటిస్తూ, బెదిరిస్తూ ...

"నన్నింతగా యేచితి పిన్నగాజేసి
మిన్నకపోదు మాయన్నకు జెప్పి
మరికదా యున్నది మాటలింకేల
కలకంఠ! యంతయు మరువకు"

అంటూ రుద్రుని భయపెట్టి యింటికి పరుగెత్తింది. ఇలా నిత్యమూ గుడగూచి పాలుతెస్తోంది, శివుడు సాకారుడై పాలు ఆరగిస్తున్నాడు.

ఒకరోజు గుడగూచి కాళీకుంచెతో యింటికి పరుగెత్తుతోంది. శివదేవయ్య ఊరునుంచి తిరిగి వస్తూ, కూతురికి ఎదురై – "అమ్మా! వట్టి కుంచె తెస్తున్నావు. పాలేవి?" అని అడిగాడు. "శివునికి ఆరగింపుజేసి వస్తున్నాను" అంది గుడగూచి. తండ్రి ఆగ్రహంతో "ఎక్కడైనా లింగం పాలు తాగుతుందా? వినని మాట; కనని మాట చెబుతున్నా వు. నేను ఇన్నేళ్ళ నుండీ పాలు ఆరగింపు చేస్తున్నాను. ఒక్కనాడైనా త్రాగాడా? నీవు పొట్టనిండా త్రాగుతూ అబద్దాలు చెబుతున్నావా? నీ చర్మం వలుస్తాను పద" అని గర్జించాడు.

గుడగూచి అమాయకంగా "నాన్నా! ఎందుకు వాదన? రేపు స్వయంగా చూద్దువుగాని కదా" అంది జాలిగా. మరునాడు తండ్రి కూతురూ ఆలయానికి వెళ్ళారు. శివుడు పాలు ముట్టుకోలేదు. తండ్రి పళ్ళు పటపటా కొరుకుతున్నాడు. గుడగూచి "హాలింగ! హాలింగ! హాలింగ!" అంటూ లింగాన్ని వాటేసుకుని, శివుని హస్తం కొరకు తడుముతోంది. చూస్తుండగానే గుడగూచి లింగంలో కలిసిపోతోంది. శివదేవయ్య "అయ్యో! నా బిడ్డ, నా బిడ్డ..." అంటూ గుడగూచిని పట్టుకోబోయాడు. అతనికి తల వెంట్రుకలు మాత్రమే చేతికి దొరికాయి. గుడగూచి శివలింగంలో కలిసిపోయింది.

గుడగూచి నిశ్చల ముగ్ధ భక్తినీ, పరమేశ్వరుని కరుణను స్మరిస్తూ భక్తులు సంవత్సరానికి రెండుసార్లు గొప్ప ఉత్సవం చేస్తారు. లింగంపైన మిగిలిన వెంట్రుకలు మొలుస్తూ ఉంటాయి. ఉత్సవం నాడు వాటిని కత్తిరిస్తుంటారు.

*

# సూరదాసుని శ్యామసుందరుడు

-రమణ ప్రసాద్

శోభిత్ కర్ నవనీత్ లియే
ఘుటురన్ చలత,రేణు తన్ మండిత
ముఖ్ దధి లేప్ కియే – శోభిత్ కర్ నవనీత్ లియే ।
కరులా కంఠ్ బజ్ర కే హరి నఖ్ రచత్ రుచిర్ హియే
ధన్య సూర్ ఏకోపల్ కా సుఖ్ కా సత్ కల్ప లియే ।
శోభిత్ కర్ నవనీత్ లియే ॥

"చేత వెన్నముద్దతో, మోకాళ్ళతో ప్రాకుతూ, అందువల్ల ధూళి దూసరమైన శరీరంతో, మూతి నిండా పెరుగు పూసుకుని వచ్చే ఆ బాల కృష్ణుని కన్నార్పకుండా చూస్తూ శోభాయమానంగా ఉన్నాడు బాల కృష్ణుడు. అందమైన చెక్కిళ్ళతో, చక్రాలలాంటి కళ్ళతో నుదట కస్తూరి తిలకం మెరుస్తూ ఉండగా, ముంగురులు అల్లలాడుతూ ఉండగా వస్తున్న కృష్ణుడిని చూసి మురిసిపోతున్నాడు సూరదాస్. ఇంకా ఇలా అంటున్నాడు. వజ్రంతో చేయబడిన పులిగోరు పతకం హృదయం పైన కదులుతూ ఉన్న మరింత శోభాయమానంగా ఉన్న కృష్ణుడిని ఒక్క క్షణం చూసినా నా జన్మ ధన్యం అవుతుంది. ఆ భాగ్యం కలుగకపోతే ఎన్ని కల్పాలు జీవించినా ఏమి ప్రయోజనం అంటున్నాడు సూరదాస్.

ఒకసారి తన ఇంట్లోనే వెన్న దొంగిలించి తింటూ ఉండగా యశోద చూసింది. తను కూడా ఆమెను చూశాడు. అప్పుడు కృష్ణునికి, యశోదకి జరిగిన సంభాషణను ఈ విధంగా వర్ణిస్తున్నాడు సూరదాస్–

మైయ్యా మై నహి మాఖన్ ఖాయో ।
భోర్ భయే గయ్యన్ కి పీఛే,మధుబన్ మోహి పఠాయో
చార్ పహర్ బన్ సే భటక్యో, సాంఝ్ పరే ఘర్ ఆయో ।
యే గావలబాల్ సబ్ బైర్ పడోహై బర్‌బస్ ధది లిపటాయో ।
మై బాలక్ బహియన్ కో ఛోటో చీజో కిస్ విధి పాయో
యహ లే అపనీ లకుటి కమలియా బహుతహి నాచ్ నచాయో।
జియ తేరి కఛు భేద్ ఉపజిహై తూ మొహి పరాయో జాయో
సూరదాస్ తబ్ బిహసి యశోదా లే ఉర్ కంఠ్ లగాయో ॥

యశోద : కన్నయ్యా వెన్న తిన్నావా?

కృష్ణుడు : (తల్లి తను వెన్న తింటూఉండగా చూసిందని తెలుసు. అయినా తిరుగు లేని విధంగా ఇలా అన్నాడు) అమ్మా! నేను ఎప్పుడో తెల్లవారుఝామున

ఆవులను తోలుకుంటూ అడవికి వెళ్ళి తిరిగి సాయంకాలానికి ఇంటికి వస్తాను. వెన్న తినటానికి నాకు సమయం ఎక్కడిది?

యశోద: మరి నీ మూతిపైన వెన్న ఎలా అంటింది?

కృష్ణుడు: నా తోటి గోపబాలురు నా మూతికి వెన్న అంటించి, నా పైన వైరంతో నీకు నామీద చాడీలు చెప్పారు. నువ్వు ఒట్టి అమాయకురాలివి. వాళ్ళ మాటలు నమ్మావు. చూడు! నా చేతులు ఎంత చిన్నవో! నువ్వు ఎక్కడో ఉట్టి మీద పెట్టినవాటినిఎలా అందు కోగలననుకున్నావు?

యశోద : తను కృష్ణుడు వెన్న తింటుండగా చూసింది కనుక నేను నమ్మను అన్నట్లుగా చూసింది.

కృష్ణుడు : (కోపం నటిస్తూ) ఇవిగో! నువ్వు ఇచ్చిన కంబళి, కఱ్ఱ తీసుకో. ఇక నేను గోవులను తోలుకు వెళ్ళను. (యశోదకి ఇంకా నమ్మకం కలుగకపోవడంతో) నాకు తెలుసు నీలో నా పై భేద భావం కలిగింది నన్ను ఉపేక్షిస్తున్నావు.

యశోద : ఎందుకని అలా అంటున్నావు?

కృష్ణుడు : నేను నల్లగా ఉంటాను కనుక నేను నీ పుత్రుడిని కాదనీ నన్ను ఎక్కడో కొనుక్కొని వచ్చారనీ అన్న బలరాముడు నాకు చెప్పాడు. అందుకనే నువ్వు నన్ను పరాయివాడిగా చూస్తున్నావు కదూ!

యశోద : (ఆ మాటలు విని పెల్లుబుకొని వస్తున్న దుఃఖంతో దగ్గరకుతీసుకుని) ఒరే నాన్నా! నువ్వు నా బిడ్డవేరా! నువ్వు వెన్న తినలేదురా నా తండ్రీ!

కృష్ణుడు : (అమ్మను కౌగిలించుకొని, తన సత్య సంథతను చాటుతూ) వెన్న తిన్నది నేనేలే అమ్మా!

ఈ విధంగా కృష్ణుడు తన తప్పిదాన్ని కప్పిపుచ్చటానికి చేసిన ప్రయత్నాలని,యశోద కృష్ణుడిని దగ్గరకు తీసుకుని లాలించిన తీరుని మనోఫలకంలో చూసి సూరదాస్ ముగ్ధుడైనాడు.



# మాఘపూర్ణిమ

సేకరణ - రమణ ప్రసాద్

అజ్ఞానమనే చీకటికి తావు లేనిది, పాపాన్ని నశింప చేసేది మాఘపూర్ణిమ. పూర్ణిమ నాడు చంద్రుడు పదహారు కళలతో ప్రకాశిస్తాడు. అందులోనుంచి ఏదీ తీయడానికి, వేయడానికీ ఉండదు. అది పూర్ణ ప్రకాశం.

మనలోని అజ్ఞానపు చీకటులను తొలగించేవాడు గురుసూర్యుడు. విశ్వమందిర విధాత అయిన శ్రీ గురుదేవుల సుందర స్వరూపాన్ని మదిలో నిలుపుకొని ఈరోజు మనం పూజచేసికొంటున్నాము. మనస్సు పెట్టి ఒక పుష్పం పెడితే అది పూజకాదా? గురుదేవుడు అజ్ఞానమనే చీకటిని జ్ఞానాంజనమనే శలాకతో శస్త్రం చేసి తొలగిస్తాడు. తల్లి ఏ విధంగా గర్భధారణ చేసిన తరువాత తొమ్మిది నెలలు మోసి బిడ్డను కంటుందో, అదే విధంగా గురుదేవులు ప్రసాదించిన లక్ష్యార్థమనే బీజాన్ని మనస్సులో ధ్యానించి జ్ఞాన ఫలాన్ని పొందాలి. హృదయంలో వేసిన లక్ష్యార్థమనే బీజాన్ని ఎవరు అనుష్ఠానం చేసి పొదుగుతారో వారు ఉన్న వస్తువు "అదే" అని తెలుసుకుంటారు. సాధకుడు అనుష్ఠానం చక్కగా చేయాలి.

చూడండి! మనం పాలు తోడుపెట్టిన తరువాత కదపకూడదు. కదిపితే అది తోడుకోదు. పాలు విరిగిపోతాయి. ఏకాగ్రత అనే నిష్ఠ పెడితే లక్ష్యార్థ స్వరూపాన్ని నువ్వు పొంద గలుగుతావు. ఆది అంతటా ఉన్నది. కదిలేది కాదు. అసలు కదలడానికి చోటు ఉంటే కదా! అయితే మాయ అడ్డు రావడం వల్ల నువ్వు జ్ఞాన ఫలాన్ని పొందలేక పోతున్నావు. మాయను తొలగింపజేసే ప్రభువు ఎవ్వడు? ఆ ప్రభువే! ఆయనే! మనను చెయ్యి పట్టుకొని నడిపిస్తున్నాడు. నీలో మారని వస్తువు ఒకటి ఉందని ప్రబోధిస్తున్నాడు. అదే "నేను." "నేను ఉన్నాను" అని అనుకుంటే అది భూతకాలం అయిపోతుంది. ఆ "నేను" అనే ఎరుకలోనే నువ్వు ఉన్నావు. నీ స్వరూపమే అది అని గుర్తించే వరకు సద్గురుబోధ వినాల్సిందే. అది గుర్తిస్తే ఈ ప్రపంచం ఏమిటో, పరమాత్మ ఏమిటో తెలుస్తుంది. ఏ శక్తి చేత ఈ ప్రపంచం పుడుతోందో, పోషింపబడుతోందో, నశిస్తోందో తెలుసుకుంటావు. ఈ ప్రపంచం ఒక కల అని తెలుస్తుంది.

అది తెలియజేసేవాడే గురుదేవుడు. గురుదేవుడు అంటే గొప్ప దేవుడు. నీ సాధన స్థిర పడితే జ్ఞానమనే నవనీతాన్ని అందుకొంటావు. సత్యం గుర్తిస్తే మనస్సు నిన్ను మభ్య పెట్టదు. కడుపు నిండిన తరువాత పంచభక్ష్య పరమాన్నాలు తిన గలుగుతావా? మనస్సును లయింపజేసేదే గురు పూజ. మాయను తొలగింపజేసేదే గురుపూజ. గురుబోధను విన్న తరువాత దానిని ఆచరణలో పెట్టడమే మనం చేయాల్సింది. దానికి దృఢమైన పురుష ప్రయత్నం ఉండాలి. అట్టి గురుపాదుకలు మిమ్ములను సర్వదా కాపాడుగాక!!

# దానశీలత్వము

-శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానంద గిరి స్వామి

పూర్వము ఒకప్పుడు కర్ణుడు తన గృహంలో అభ్యంగన స్నానం చేస్తున్నాడు. నవరత్న ఖచితమైన ఒక పాత్రలో నూనె, మరొక పాత్రలో సున్నిపిండి ఉంచుకుని, ఒక చోట కూర్చుని స్వయంగా నూనెతో తలంటుకుంటున్నాడు. సరిగ్గా శ్రీకృష్ణుడు అదే సమయానికి అతని గృహానికి వచ్చాడు. కర్ణుడు తలంటుకోవటం, ప్రక్కనే నవరత్నఖచితమైన పాత్రలు ఉండటం చూసి, నటనసూత్రధారియైన గోవిందుడు ఆ పాత్ర తనకి కావాలని అడిగాడు.

దేవేంద్రునకు తన సహజకవచకుండలములనే దానము చేసి, దానకర్ణుడు అనిపించుకున్న మహానుభావుడు, ఇప్పుడు సాక్షాత్ పరమాత్ముడే చేయిచాచి, గిన్నె ఇమ్మని అడిగితే కర్ణుడు వెనుకంజ వేస్తాడా?

వెంటనే కర్ణుడు కుడిచేత్తో తలంటు పోసుకుంటున్నాడు కనుక, ఎడమచేతితో ఆ గిన్నెను తీసి శ్రీకృష్ణుడికి సమర్పించబోయాడు. కాని కృష్ణుడు దాన్ని తీసుకోకుండా, "కర్ణా! నీ ఎడమచేతితో నాకు సమర్పించుట? ఇది శిష్టాచారము కాదని నీకు తెలియదా?" అని అడిగాడు.

కర్ణుడు "ఓ కృష్ణా! ఇప్పుడున్న ధనము మరుక్షణంలో మాయమై పోవచ్చు! ఇప్పుడున్న జీవితం ఉత్తరక్షణంలో అంతమైపోవచ్చు! యమధర్మరాజు ఎవరిపైనను విచక్షణ చూపడు. జీవుల ధర్మబుద్ధి త్వరితగతిని మార్పునొందుచుండును! కాబట్టి తలంటుకొనుచున్న నూనె చేతిని, కడిగి దానితో నీకు ఆ పాత్ర ఇచ్చే లోపల నా బుద్ధి ఏమి మారిపోవునో! అంతవరకు నా జీవితం ఉంటుందో లేదో! అనే విచికిత్స నాలో కలిగి, తత్ క్షణమే నేను దాన్ని నీకు ఇవ్వబోయాను. అంతేకాని నాకు తెలియక కాదు" అని అన్నాడు.

కర్ణుడి ఆధ్యాత్మిక భావపరిపూర్ణమైన ఆ మాటలు విని శ్రీకృష్ణుడు చాలా సంతోషించాడు.

***దాన ధర్మాలను వెనువెంటనే చేయవలెను. జీవితం క్షణభంగురమని గుర్తెరిగి ధర్మకార్యాలను విరివిగా చేయవలెను.***

*

# ఇద్దరు సాధువులు

- రామదాసు

ఒక పట్టణంలో ఇద్దరు సాధువులు వేర్వేరు ప్రక్కల నుంచి వచ్చి, ఒకరు మఱ్ఱి చెట్టు క్రింద, మరొకరు రావి చెట్టు క్రింద నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఒక వ్యాపారి మఱ్ఱి చెట్టుక్రింద ఉన్న సాధువుకు సాష్టాంగ నమస్కారంచేసి, "మహాత్మా! ఇంకొక సాధువు మన ఊరికి వచ్చారు. వారు మీకు తెలుసా?" అని అడిగాడు. "ఆఁ ఆ దున్నపోతు బాగా తెలుసు నాకు" అన్నాడు ఆ సాధువు.

ఆ కోమటి గడ్డిమోపుతో సహా రెండో సాధువు దగ్గరకు వెళ్ళి, గడ్డి అతని ముందు పెట్టి, సాష్టాంగ నమస్కారం చేశాడు. "నీ ఉద్దేశమేమిటి? ఈ గడ్డిమోపును ఎందుకిలా పెట్టావు?" అన్నాడు సాధువు."స్వామీ! మీరు దీన్ని ప్రసాదంగా స్వీకరించి, భుజించి, నన్ను ఆశీర్వదించండి" అన్నాడు వినయంగా కోమటి."నీకేమైనా మతిపోయిందా! గడ్డి తినటమా!" అని మండిపడ్డాడు సాధువు. "మహాప్రభూ! పట్టణానికి ఆవలివైపు మఱ్ఱిచెట్టు క్రింద ఉన్న స్వామి ఎంతో దయతో మీరు దున్నపోతు అని సెలవిచ్చారు. అందుచేత మీకిష్టమైన ప్రసాదాన్ని తెచ్చాను" అని ఎంతో శాంతంగా చెప్పాడు కోమటి."అతని మాటలను నీవెలా నమ్మావు? నీకు తెలివి ఏ మాత్రమూ లేదా?" అని నిష్ఠూరంగా అడిగాడు సాధువు."నా వంటి అజ్ఞాని, అమాయకుడు మిమ్మల్ని ఎలా అర్థం చేసుకోగలడు? మహాత్ములను మహాత్ములే గుర్తించగలరు" అన్నాడు కోమటి."సరి, సరి మంచిది. ఆ సాధువు దగ్గరకు వెళ్ళి 'గాడిద' అన్నానని చెప్పు" అన్నాడు సాధువు.

కోమటి వెంటనే తిన్నగా అక్కడినుంచి బయలుదేరి బజారువెళ్ళి ప్రత్తి గింజలు మోపు కొనుక్కుని మఱ్ఱి చెట్టు క్రింద ఉన్న సాధువు దగ్గరకు తిరిగి వెళ్ళాడు. మూట విప్పి ప్రతిగింజలు క్రిందపోసి దండం పెట్టాడు. ఆ సాధువు ఆశ్చర్యంగా "ఏమిటి ప్రత్తి గింజలు ఎందుకు తెచ్చావు?" అని అడిగాడు."అవును స్వామీ! మీకిష్టమైన ఈ పదార్థాన్ని బహుమతిగా తీసుకుని, నాపై దయ చూపండి" అన్నాడు."నీకేమైనా మతి భ్రమించినదా? ప్రత్తిగింజలు తినటమేమిటి?" అని చిరాకు పడ్డాడు. "రావిచెట్టు క్రింద ఉన్న స్వామి మీరు 'గాడిద' అని సెలవిచ్చారు. వాటికి ప్రత్తిగింజలు ఇష్టముకదా అని తెచ్చాను" అన్నాడు. "పిచ్చివాడా! నేను గాడిదను కానని నీకు కళ్ళు కనబడటం లేదా?" అన్నాడు. "నాకు అవన్నీ ఎలా తెలుస్తాయి స్వామీ? మాయలో ఉన్న వాణ్ణి. మహాత్ములను, మహాత్ములే అర్థం చేసుకోగలరు అని పెద్దలమాట కదా" అని చిరునవ్వుతో అన్నాడు. "ఆ దున్నపోతు ఎక్కడున్నాడో చెప్పు, తన కంటె పెద్దవాళ్ళగురించి ఎలా మాట్లాడాలో నేర్పుతాను" అంటూ కోపంగా రెండుకాళ్ళూ పైకి ఎత్తి అతనితో బయలు దేరాడు. ఇద్దరు సాధువులు దెబ్బలాడుకుంటుంటే, కోమటి తమాషా చూస్తూ నిలబడ్డాడు.

*

# వాదన

– వెంకట రమణ ప్రసాద్

ఒక ముద్రా పండితుడు సవాలు చేశాడు. ఆస్థానంలో ఒక ఏకాక్షి మూర్ఖుడికి పండితుడి వేషం వేసి పోటీకి నిలిపారు.

పండితుడు ఒక చూపుడు వేలు చూపాడు.

ఏకాక్షి రెండు వేళ్ళు చూపాడు.

పండితుడు మూడు వేళ్ళు చూపాడు.

ఏకాక్షి ముష్టి (పిడికిలి) బిగించాడు.

పండితుడు ఓడిపోయానని ఒప్పుకుని వెను తిరిగి వెళ్ళిపోయాడు.

"ఎందుకు ఓడిపోయావు?" అని అందరూ అడిగితే దానికి సమాధానంగా పండితుడు ఇలా చెప్పాడు.

"నేను భగవంతుడు ఒక్కడే అని ఒక వేలు చూపాను. కాదు జీవాత్మ పరమాత్మలు రెండు అని ఆయన రెండు వేళ్ళు చూపాడు. నేను ప్రకృతిని కలిపి మూడు అని మూడు వేళ్ళు చూపాను. దానికి ఆయన మొత్తం ఒకటిలో అంతర్భాగాలే అని పిడికిలి బిగించి చూపాడు. ఆయనలో ఉన్న గొప్పతనం నాకు తెలిసింది. అందుకే నేను నా ఓటమిని అంగీకరించాను" అన్నాడు ఆ పండితోత్తముడు.

"పండితుణ్ణి నువ్వు ఎలా ఓడించగలిగావు?" అని ఏకాక్షి (మూర్ఖుణ్ణి) అందరూ అడిగితే, దానికి ఏకాక్షి ఇలా చెప్పాడు.

"ఆయన ఒక వేలు చూపించి, నీకు ఒంటి కన్నే అని ఎగతాళి చేశాడు. నేను నాది ఒక కన్నే అయినా, నీ రెండుకళ్ళతో సమానము అని రెండువేళ్ళు చూపించాను. ఆయన మనిద్దరివి కలిపి మూడు కళ్ళు అని హేళనగా మూడువేళ్ళు చూపించాడు. నాకు ఒళ్ళు మండిపోయి మూతిమీద గుద్దుతాను నిన్ను అని పిడికిలి బిగించి చూపాను. దానితో భయపడి వెనక్కి వెళ్ళిపోయాడు. అంతే!" అన్నాడు మూర్ఖ ఏకాక్షి.

ఒకళ్ళ మాటలు ఒకళ్ళకి అర్థం కాని వాదనలు ఇలాగే ఉంటాయి.



# శ్రీసద్గురు పుణ్యారాధన రజతోత్సవ వేడుకలు
## అందరూ ఆహ్వానితులే

శ్రీసర్వాధిష్ఠాన చైతన్య విశ్వమత ప్రవక్త సమర్థ సద్గురు శ్రీశ్రీశ్రీ హనుమత్కాళీవర ప్రసాద బాబూజీ మహరాజ్‌వారి రజతోత్సవ పుణ్యారాధనములు కాళీవనాశ్రమ పీఠాధిపతి పూజ్య యోగిని శ్రీ చంద్ర కాళీప్రసాద మాతాజీ వారి ఆధ్వర్యంలో శ్రీకాళీవనాశ్రమం (శ్రీకాళీగార్డెన్స్), నంబూరులో ది. 20-11-2013 బుధవారం నుండి ది. 1-12-2013 ఆదివారం వరకు పంచయజ్ఞ విధులతో జరుపబడును. నిత్యమూ శ్రీగురుగీతా ప్రచనము, శ్రీసద్గురు శతసహస్ర నామార్చనలు, మహామంగళ హారతులు ఉంటాయి. డిసెంబర్ 1వ తేదీ ఉదయం మహాభిషేకం, మహామంగళహారతి, దీక్షావిరమణ.

విశేష కార్యక్రమాలు -

నవంబర్ 20 నుండి బ్రహ్మశ్రీ కొండూరి రామబ్రహ్మంగారి ఆధ్వర్యంలో హెూమము జరుగును.

నవంబర్ 24, 25, 26 తేదీలలో సాధుధర్మ సమ్మేళనము.

నవంబర్ 27న యతి పూజలు.

ఈ ఉత్సవాలలో అఖండ హరినామ సంకీర్తన, సామూహిక సద్గురుపాద పూజలు, నౌకావిహారము, ఊంజల సేవ, నగరోత్సవములు ఉంటాయి.

ఈ కార్య క్రమాలలో ప్రతి భక్త హృదయము పాల్గొనాలని మా ఆకాంక్ష. ఈ కార్యక్రమాలలో పాల్గొనుటకు వీలుగా శలవు పెట్టుకునేందుకు ముందుగా తెలియచేయుచున్నాము.

వివరములకు -

ట్రస్ట్ కార్యాలయము - 0863 2293564

కుమారస్వామి రాజా - 93465 35357

మురళీమోహనవర్మ - 93983 34345

ఎ. కుమారస్వామి - 93945 35357

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

గత సంచిక తరువాయి — విజయేశ్వరానంద ప్రసాద్

## చిరంజీవిరాజుగారితో శ్రీబాబు

శ్రీబాబు శేషమాంబగారిని 'అమ్మన్నా' అని పిలిచేవారు. వారితో శ్రీబాబు "అమ్మన్నా! రాజుకు, రాఘవమ్మకు తమ బాధ్యతలను గూర్చిన అవగాహన లేకనో, నా మీద ఉన్న వల్లమాలిన భక్తి చేతనో అలా అంటే మాత్రం, పెద్దవారు మీరైనా దాని లోతుపాతులు, మంచిచెడ్డలను గురించి వాళ్ళకు తెలియ చెప్పకపోగా, వాళ్ళతో మీరూ శృతి కలుపుతున్నారేమిటి? అంతా నాకు కట్టబెట్టి, మా అమ్మడికి ఏమీ మిగల్చరా?" అని అడిగారు.



శేషమాంబగారు "బాబూ! ప్రథమ దర్శనంలోనే మీరు నాకు చిరంజీవికి అన్నగారుగా కనిపించారు. అందుకనే 'పెద్దబ్బాయి' అని మిమ్మల్ని పిలుచుకుంటున్నాను. కనుక ఈ కుటుంబానికి పెద్దగా యీ యావదాస్తికి, మా అందరికి, యజమాని తమరే కదా. అందువలన ఈ బాధ్యత అంతా మీకు అప్పగించి, మీ చల్లని పాదపద్మాల వద్ద కన్ను మూయటం కంటే మేము కోరుకోదగినదేమున్నది? ఇక చంద్ర మాటంటారా, సర్వలోకప్రభువైన మీరే చంద్రకు మిగిలిన యావదాస్తి. ఇక దానికి మించిన భాగ్యవంతులు ఎవరుంటారు?" అన్నారు. త్యాగానికి ఇంతకు మించిన పరమావధి ఏముంటుంది?

శ్రీబాబు మాట్లాడుతూ "నేను సర్వలోక ప్రభువైనప్పుడు, ఈ ఆస్తులు, భోగ భాగ్యాలు అన్నీ నేను మీకిచ్చినవే అని అనుకున్నప్పుడు, నావి తిరిగి మీరు నాకు ఇవ్వటమేమిటి? నేను వాటిని తిరిగి తీసుకోవటం ఉచితమేనా?" అని ఎదురు ప్రశ్న వేశారు. ఈ ప్రశ్నకు జవాబు చెప్పలేక వారందరూ నిరుత్తరులైనారు.

అప్పుడు వారిని అనునయిస్తూ శ్రీబాబు "నాకు మీరు సమర్పించ వలసినది, నేను మీ నుండి కోరుకునేది, పవిత్రము, నిర్మలమూ అయిన మీ మనస్సులు. ఇప్పుడు మీరు చేసిన ఈ ప్రస్తావన ద్వారా నిజంగా మీరు మీ తను, మనో, ధనాలు నాకు అర్పించుకున్నారు. అదొక్కటే చాలు మీరు నన్ను సంతోషపెట్టటానికి. ఈ ఆస్తులతో నాకు పని ఏమున్నది? అనేక కోటి బ్రహ్మాండాలకు జనని ఉండగా నాకేమి కొరత? నేను చెప్పినట్లు ఆచరించుకోండి. చాలు. తరించగలుగుతారు" అన్నారు.

కాని అవధులు దాటిన రాజుగారి వైరాగ్యము శ్రీబాబు మాటలతో శాంతించ లేదు."నా ఆస్తి అంతా మనసారా మీకర్పితమైనది. మీరు దానిని స్వీకరించకపోతే,

నేను దాన్ని దానధర్మాలకో, మరేదైనా సేవా కార్యాలకో వినియోగిస్తాను" అన్నారు రాజుగారు.

శ్రీబాబు కరుణాంతరంగులై రాజుగారికి కర్తవ్యాన్ని ఆదేశిస్తూ , "సరే, ఈ యావదాస్తిని మీరు కుటుంబంతో సహా నాకు అర్పించారు కదా. నేను స్వీకరిస్తున్నాను. ఇప్పుడు యీ కుటుంబానికి యజమానిని నేను. ఈ ఆస్తి అంతటికి అధికారిని నేను. కనుక నీవు నాకు విధేయుడవై నా తరపున ఈ ఆస్తి బాగోగులు, ఈ కుటుంబ సంక్షేమం చూసుకుంటూ, ఇక నుండి బాధ్యతగల నా ప్రతినిధిగా వ్యవహరించాలి నీవు. ఎక్కడా పొరపాటు జరగకుండా చూసుకోవలసిన బాధ్యత నీపై ఉంచుతున్నాను. కుటుంబ బాధ్యతలను సక్రమంగా నెరవేర్చిన తరువాతనే, మిగిలిన ధనాన్ని దానధర్మాలకు వినియోగించ వలసినదిగా నీకు అనుమతిస్తున్నాను. ఇది నీ గురువుగా నీకు నా ఆజ్ఞ! జాగ్రత!" అని దృఢ స్వరంతో అన్నారు.

అప్పటి నుండి రాజుగారు వారి కుటుంబంతో సహా ఆ ఆస్తికి శ్రీబాబు యొక్క ప్రతినిధిగా మాత్రమే వ్యవహరిస్తూ, అనన్య భక్తి శ్రద్ధలతో శ్రీగురుచరణ సేవకు అంకితులై తమ సర్వస్వమునూ స్వామి సేవకు, సత్కార్యాలకు వినియోగించారు. రాజుగారు, వారి తల్లిగారు కీర్తిశేషులైనా, ఇప్పటికీ రాఘవమ్మగారు, చంద్ర ఆ ఆస్తికి తమ్ము తాము ట్రస్టీలుగా మాత్రమే భావించుకుని శ్రీబాబు ప్రతినిధులుగా మాత్రమే వ్యవహరిస్తున్నారు.

ప్రాపంచిక విషయాలకు పూర్తిగా విరక్తులైన రాజుగారు, శ్రీబాబును ఒక కోరిక కోరారు. ఒక మహాక్షేత్రంలో శ్రీబాబు దివ్య సన్నిధిలో తన దేహాన్ని చాలించాలని రాజుగారి కోరిక. శ్రీబాబు అలాగే అని అభయమిచ్చారు.

శ్రీబాబు 1961 నుండి 1965వరకు ప్రతిసంవత్సరం భక్తులందరితో కలసి, కార్తీకమాసంలో శ్రీశైలయాత్ర చేశారు. 1962లో శ్రీశైలం యాత్రకు బయలుదేరుతూ, శ్రీబాబు రాజుగారికి చంద్రను, రాఘవమ్మను తీసుకుని శ్రీశైలం రావలసినదిగా కబురుచేశారు. రాఘవమ్మగారు కొన్ని ఇబ్బందుల వలన వెళ్ళలేకపోయారు. రాజుగారు చంద్రను తీసుకువెళ్ళి శ్రీబాబుతో శ్రీశైల యాత్ర చేశారు.

1963లో మళ్ళీ శ్రీశైలయాత్ర సన్నాహాలు జరుగుతున్నాయి. చిరంజీవిరాజు గారికి సుస్తీగా ఉంది. భవిష్యద్రష్టలైన శ్రీబాబు రాజుగారితో "నీవు ముందుగానే సకుటుంబంగా శ్రీశైలం వెళ్ళు. అక్కడ శ్రీమల్లికార్జునస్వామికి అభిషేకము, బిల్వార్చన, శ్రీ భ్రమరాంబదేవికి కుంకుమ పూజ అన్నీ విశ్రాంతిగా చేసుకోండి. మీకు మేలు జరుగుతుంది. భక్తులందరితో కలిసి చేసుకోవటమంటే మీకు హైరానగా ఉంటుంది. పూర్ణిమ నాటికి మేమూ అక్కడకి వస్తాము" అని చెప్పారు. రాజుగారు అలాగే ముందుగానే సకుటుంబంగా వెళ్ళి శ్రీశైలంలో అన్ని పూజలు ముగించుకున్నారు.

– సశేషం

# శ్రీ రాధా మాధవ రస సుధ

- శ్రీ హనుమాన్ ప్రసాద్ పోద్దార్

హే వృషభరాజ నందినీ! హే అతుల ప్రేమరస సుధా నిధానమా!
గోవులను మేపుతూ అడవి అడవి తిరుగుతుండే నేను ప్రేమ సరళిని ఎట్లా అర్థం చేసుకోగలను?
గోపబాలక బృందంతో కలిసి తిరుగుతూ సదా గ్రామీణ క్రీడలనాడుతూ ఉంటాను.

నీవు ప్రేమ సుధా సరితవు. తప్తధూళివంటి వాడిని నేను. మనిద్దరికీ మేళనం ఎలా పొసగుతుంది?



నీవు అనురాగిణివి! నా స్వామినివి! నీ ప్రేమ పూర్ణ దర్శనాన్ని యిచ్చినప్పుడు నాకు సుఖాతిరేకం కలుగుతుంది,

నీకు అమితంగా ఋణపడతాను.
నీ ఋణం ఎలా తీర్చుకోను?

నేను నిత్య ప్రేమధనహీనుడనే; నీవే దయతలచి నాకు ప్రేమదానం చేయి.
నన్ను కృతార్థునిగా చేస్తూ ఉండు.

నీ
శ్యామసుందరుడు

*సాధన మధ్యలో చనిపోతే ఏమవుతుంది?*

*ఆ తరువాత దశ మొదలవుతుంది.*

*4వ తరగతి చదువుతూ ఆపినవాడు అక్కడి నుంచే చదువుతాడుకాని, 1వ తరగతి నుంచి కాదుకదా?*

*తిరుపతి కొండ ఎక్కుతూ అలసి, నిద్రపోయినవాడు నిద్ర లేచాక అక్కడి నుంచే కాని, మళ్ళీ క్రిందకి వెళ్ళి పైకి రాడు కదా!*

విష్ణు  కథలు

గతసంచిక తరువాయి

-రమణ ప్రసాద్

# జ్ఞానదేవుడు

శ్రీ గురుదేవులు శిష్యుని శిష్యత్వాన్ని హరింపజేసి తనతో ఐక్యత్వాన్ని ప్రసాదిస్తాడు. కల్పన చేత నిర్మితమైన మాయ అనే సింధువును గురుకృప దాటిస్తుంది.

స్థూల దృష్టికి మనకు ఏది గోచరమవుతోందో అది పాంచ భౌతికమైన జడాకాశం. అందులో అంతర్భూతంగా ఉన్న చిదాకాశాన్ని మనం పోల్చలేము. పరమాత్మ స్వరూపులైన సద్గురువులు అట్టి చిదాకాశ స్వరూపులు. శ్రీ సద్గురుదేవుల వలననే సూర్యునికి వేడిమి, చంద్రునికి చల్లదనము, నక్షత్రాలకు కాంతి లభిస్తాయి.



ఎలా వెన్నెలకి కారణం చంద్రుడో పరమాత్మ జగత్తంతటికి కారణం. అతడు సర్వవ్యాపకుడు. సర్వే సర్వత్ర ఉన్న స్థూలదృష్టికి గోచరింపడు. పరమాత్మ భాషకు అందడు. శబ్దానికి అందడు. ఆ పరమాత్మ అన్నిటికి ఆవల ఉండేది, అని తెలుసుకొన్న తరువాత అది ప్రకటితమయి అనుభవానికి వస్తుంది. అప్పుడు ఆ ఆత్మవస్తువు నిరాకారమైనా, ఒక రూపం ధరించి ప్రత్యక్షం అవుతుంది.

ఒక్కసారి పరమాత్మ సాక్షాత్కారం కలిగిన తరువాత ఆ నామ రూపముల ప్రయోజనం సిద్ధించి, ఇక నామ రూపాల అవసరం లేకుండా పోతుంది. అప్పుడే శ్రీ గురుదేవులకు నివృత్తి అన్న సార్థక నామం అవుతుంది.

సత్ వలన అసత్వానికి సత్యత్వం లభిస్తుంది. అచేతనానికి మిథ్యా ప్రపంచానికి చైతన్యం కలుగుతుంది. ఈ సత్తా కల్పించే మాయలో జగత్తు సత్యమైనదిగా భాసిస్తుంది.

'ఓ గురుదేవా! మీ మాయా ప్రకాశంలోనే మాయను చూపిస్తారు. ఆ వెలుగులోనే ప్రపంచాన్ని దర్శింపజేస్తారు. అలా దర్శింపజేసి ఇది మిథ్య, నశ్వరము అని బోధిస్తారు. ఈ జగత్తు మాయ అనీ, దానిని పట్టుకు ప్రాకులాడవద్దనీ చెబుతారు. మీ గురించి మీరు చెప్పుకోరు. మీ వ్యాపకత్వం ఎంత గొప్పది? అన్ని రూపాలూ మీవే.'

'శిష్యుని పై కరుణ కలిగితే శిష్యుని అహంకారాన్ని, 'నీవు, నేను' అనే భేద బుద్ధిని అణిచి మీలో లీనం చేసుకుంటారు. అప్పుడు శిష్యుడు గురుదేవుల స్వరూపంలో మిగిలి ఉంటాడు. గురుదేవులకు స్వరూపం ఉంటే కదా! సద్గురుదేవుల కృప వలన 'నేను ఆత్మను' అనే భావం సైతం సూర్యోదయం కాగానే చీకటి తొలగినట్లు , ఉప్పురాయి నీటిలో పడగానే కరిగిపోయినట్లు హరించిపోతుంది.

శ్రీ సద్గురుదేవులు అద్వైతము తప్ప ద్వైతాన్ని ప్రదర్శింపరు. వారి చరణ స్పర్శతో భేదం అభేదంగా మారిపోతుంది. సూర్యుడు తనకోసం ఉదయించడు. అలాగే శ్రీ సద్గురుదేవులు తమ కోసం ఏదీ చేయరు.

సమర్పణ బుద్ధితో సద్గురుదేవులకు నమస్కారం చేసేవారు, నామరూపాలకు అతీతులై అద్వైత స్థితిని పొందుతారు. ఆ స్థితిలో వారికి బింబమే లేనప్పుడు ప్రతిబింబము ఎలా లేకుండా పోతుందో అలాగే వందనం చేసే శిష్యుడు, వంద్యుడైన గురుదేవులూ లేకుండా పోతారు. వందనం చేసే వాడిలో ద్వైతభావం పూర్తిగా నశించిపోతుంది. 'ఏకమేవాద్వితీయం బ్రహ్మ' అనే మహా వాక్యం యొక్క అనుభవస్థితి అదే.

ఈ జగత్తు అందులోని నామరూపాలూ అవిద్యకు సంబందించినవి. నామరూపాలను దాటి ఆయా నామరూపాలను ధరించిన సద్వస్తువు పై నిలవనిదే అజ్ఞానం నశించదు జ్ఞానం సిద్ధించదు. అవిద్యా కల్పితమైన ఈ మాయను దాటాలంటే శ్రీ సద్గురుదేవుల చరణాలను ఆశ్రయించటం కంటే మరో మార్గం లేదు. సద్గురుదేవుల కృప వల్ల శిష్యుడు ఏ స్థితికి చేరతాడు అంటే అక్కడ జ్ఞానం కూడా వ్యర్థం అవుతుంది. అదెలా? అంటే జ్ఞానం యొక్క లక్ష్యం ఆత్మసాక్షాత్కారమే కదా. ఒక్కసారి ఆత్మసాక్షాత్కారమైతే హృదయగ్రంధి భిన్నమై, అన్ని సందేహాలు తీరిపోయిన తరువాత జ్ఞానంతో పనిలేదు. అట్టి స్థితిని చేరుకోవాలంటే గురు పాదాశ్రయం వల్లనే అది సాధ్యం అవుతుంది. "అటువంటి అనుభవమే శ్రీ సద్గురుదేవుల కృప వల్ల నాకు కలిగింది" అంటున్నారు జ్ఞానదేవులు.

అగ్ని అన్నిటిని దహించివేస్తుంది. అన్ని మలినాలను దహించి వేస్తుంది. అయినా అగ్నిని ఏ మలినమూ అంటదు. అగ్నిలో దహింపబడేది దహించబడగానే అగ్నితో ఏకరూపం చెందుతుంది. శ్రీ సద్గురుదేవులు పరమ పవిత్రమైన అగ్ని వంటివారు. అన్నిటిని దహించగల అగ్ని సహితం దహించలేని అజ్ఞానం శ్రీ సద్గురుదేవుల కృపవల్ల దహింపబడుతుంది. అలా శిష్యునిలోని అజ్ఞానం దగ్ధంకాగానే అగ్ని చందనాన్ని దహించిన తర్వాత ఆ చందనం అగ్ని రూపం ఏవిధంగా పొందుతుందో అదే విధంగా శ్రీ సద్గురుదేవులు, శిష్యుడు ఏకస్వరూపులుగా అవుతున్నారు.

నిద్రనుండి మెలకువ రాగానే స్వప్నంలో కనిపించిన సుందరి మాయమవుతుంది. అలాగే సద్గురుదేవుల దర్శన భాగ్యంతో శిష్యునిలోని ద్వైత భావం పూర్తిగా హరించవేయబడుతుంది. శ్రీ సద్గురుదేవుల కృప వలన శిష్యుడు త్వమేవాऽహం అన్న స్థితిని, 'అహం బ్రహ్మాऽస్మి' అన్న పదాన్ని దాటి వెళ్ళిపోతాడు. గురుదేవులకు నమస్కరించేటప్పుడు వందనం చేసేవాడు, వందనం స్వీకరించేవాడు అన్న ద్వందాన్ని నిర్మూలింపజేసేందుకే సమర్పణ బుద్ధితో శ్రీ సద్గురుదేవులకు మనస్సులోనే నేను నమస్కరించుకుంటున్నాను.

నా ఆత్మ సహోదరుడు, ఆత్మసఖుడు అయిన సద్గురుదేవులు రూపంలేని వారు. జన్మమృత్యువులకు అతీతమైన శ్రీ సద్గురుదేవుల స్వరూపం చాలా అద్భుతంగా, ఆశ్చర్యంగా, విచిత్రంగా కనిపిస్తుంది. అది వర్ణనాతీతం. గురువు-శిష్యుడు అనే ద్వైతబుద్ధి లేకపోతే శిష్యుడు గురుదేవుల నిజస్వరూపాన్ని తెలిసికోలేడు.

ఈ యావత్ ప్రపంచం ఆయన కుక్షిలో ఇమిడిఉంది. వెలుతురులో నిజమైన దానిలాగా కనిపించే ఈ ప్రపంచం, చీకటిలో కనిపించకుండా పోతుంది. ఈ జగత్తుకు కనిపించటం, కనిపించకుండా పోవటం అని రెండు స్థితులు ఉన్నాయి. సముద్రానికి ఆటు పోటులాగా  అలాగే పగలు రాత్రి కల్పించబడుతుంది. ఈ ద్వందాలకు అతీతులు శ్రీ గురుదేవులు. అందుకే జ్ఞానదేవులు అంటున్నారు "గురువు శిష్యుడు అనే రెండు పదాలూ వేరుగా కనిపిస్తున్నా వాటి అర్థం ఒకటే. అదేమిటి అంటే సద్గురు దేవులని.

ఈ గురుశిష్యుల బంధం అభరణాలలో ఉండే బంగారం సర్వాభరణాలలో వ్యాపించి వాటినుండి విడదీయటానికి వీలు లేకుండా ఎలా ఉందో, చంద్రుడు, వెన్నెల, కర్పూరం దాని సువాసన, పటిక బెల్లం దాని తీపి ఎలా విడదీయలేమో అలా విడదీయరానిది. కార్యాకారణాలకు, ఆధారానికి ఆధేయానికి మధ్యగల అవినాభావ సంబంధం వంటిది. అలాగే గురువులేక శిష్యుడు లేడు. శిష్యుడు లేక గురువు లేడు. కేవలం సచ్చిదానంద పరబ్రహ్మమే అయిన శ్రీ గురుదేవులు రూపాంతరాలు అయి ఉండి కూడా శిష్యోద్ధరణ కోసం జగత్తులో అవతరిస్తారు.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL